STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 339 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 7 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

బతికుండగానే శ్మశానవాటికకు..!

- వేములవాడలో హృదయవిదారక ఘటన..
- వ్యక్తికి కిరాయి ఇంట్లోనూ దక్కని ఆశ్రయం
- ఇంటి యజమాని నిరాకరణతో తప్పని దుస్థితి
- ఎమ్మెల్యే ఆది స్పందించి ఆదుకోవాలని వేడుకోలు

4



మైనారిటీల అభ్యున్నతికి

పెద్దపీట

- సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం
- ఓల్డ్ సిటీ అభివృద్ధికి భారీగా నిధుల కేటాయింపు
- ఉప ముఖ్యమంత్రి

2



ఆటోమోటివ్, ఈవీ రంగాల్లో పెట్టుబడులే లక్ష్యం

11న మంత్రి పొన్నం అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం!

25 మంది పారిశ్రామిక ప్రముఖులతో కార్యనిర్వాహక మండలి

2



స్టాక్ మార్కెట్‌లో లాభాల జాతర!



- ఒక్కరోజే 1,718 పాయింట్లు దూసుకెళ్లిన సెన్సెక్స్
- మళ్లీ 25 వేల మార్కును అధిగమించిన నిఫ్టీ
- వరుసగా ఏడో రోజూ లాభాల్లో ముగిసిన దేశీయ సూచీలు
- భారీగా కొనుగోళ్లకు దిగిన విదేశీ సంస్థాగత మదుపర్లు
- ఒక్కరోజే రూ.14,975 కోట్ల విదేశీ పెట్టుబడులు
- బ్యాంకింగ్, ఆటోమొబైల్ షేర్లకు భారీగా కొనుగోళ్ల మద్దతు

4

మరో అవకాశం!

ఓటు గల్లంతైన వారికి ఈసీ మరో చాన్స్!

ముసాయిదా జాబితాలో పేరు లేకున్నా చేర్చుకునే అవకాశం



తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు రోజురోజుకూ తీవ్రమై బహిరంగమవుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా నేతల మధ్య సరైన సమన్వయం కొరవడటంతో పార్టీకి తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రతిపక్షాలను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన సొంత పార్టీ నాయకులే స్వయంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వైఖరిని, ప్రభుత్వ నిర్ణయాలను బహిరంగంగా ప్రశ్నించడం కలకలం రేపుతోంది. ముఖ్యంగా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న తీవ్ర అసంతృప్తికి ప్రత్యక్ష అద్దం పడుతున్నాయి.

హస్తంలో అసంతృప్తి సెగలు!

- రోడ్డెక్కుతున్న కాంగ్రెస్ అంతర్గత విభేదాలు
- సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలపై సొంత ఎమ్మెల్యేల అసంతృప్తి
- నిధులు, పదవుల పంపిణీపై నేతల మధ్య విభేదాలు
- అనిరుధ్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలతో రాజకీయ చర్చ
- మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు
- క్రమశిక్షణ కమిటీ తీరుపైనా విమర్శలు
- విభేదాల పరిష్కారం నాయకత్వానికి సవాలంటున్న రాజకీయ వర్గాలు

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్): తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న నేపథ్యంలో నేతల మధ్య సమన్వయం, అభివృద్ధి నిధుల కేటాయింపు, నామినేటెడ్ పదవుల పంపిణీ వంటి అంశాలపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కొందరు ఎమ్మెల్యేలు ప్రభుత్వ నిర్ణయాలను బహిరంగంగా ప్రశ్నించడం పార్టీ నాయకత్వానికి ఇబ్బందికరంగా మారిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో కొనసాగుతున్న అసంతృప్తిపై చర్చకు కారణమయ్యాయి. ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వాల్సిన అధికార పార్టీ నాయకులే అంతర్గత సమస్యలను బహిరంగంగా ప్రస్తావిస్తుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. కాంగ్రెస్‌లో సీనియర్ నాయకులకు తగిన గుర్తింపు లభించడం లేదని, ఇతర పార్టీల నుంచి కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యం పెరుగుతోందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేసిన నాయకులకు పదవుల పంపిణీలో న్యాయం జరగాలన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోవైపు జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్

మిగతా 2 లో

కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో భారీ అగ్నిప్రమాదం

- మంటల్లో చిక్కుకుని నాలుగు బోగీలు దగ్ధం
- పంజాబ్‌లోని సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపంలో ఘటన
- అప్రమత్తమైన లోకో పైలట్.. సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు
- ప్రాణనష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

వివరాలు 4లో..




దీపావళి వేడుకల్లో బాధ్యత అవసరం

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు! 4

వంద దేశాలకు వేదికగా హైదరాబాద్!

- 12 నుంచి అంతర్జాతీయ భారత్ సమ్మిట్
- హైటెక్స్‌లో ప్రతిష్ఠాత్మక సదస్సుకు భారీ ఏర్పాట్లు
- 100 దేశాల నుంచి హాజరుకానున్న ప్రతినిధులు
- 450 మంది అంతర్జాతీయ ప్రముఖులకు ఆహ్వానాలు
- కేంద్ర మంత్రులు, ఎంపీ శశి థరూర్ సహా పలువురు ప్రముఖుల రాక
- దౌత్య, ఆర్థిక సంబంధాల బలోపేతమే ప్రధాన లక్ష్యం



అంతర్జాతీయ సదస్సులకు వేదికగా నిలుస్తున్న హైదరాబాద్ మరో ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజులపాటు నగరంలోని హైటెక్స్‌లో అంతర్జాతీయ భారత్ సమ్మిట్ నిర్వహించనున్నారు. 2



ప్రభుత్వ పథకాల లబ్ధికి ఓటర్ ఐడీ

బీజేపీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు! 4

- ఓటర్ల జాబితాల ఆధారంగా లబ్ధిదారుల ఎంపికపై అభ్యంతరం
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై మరోసారి విమర్శలు
- జ్ఞానేశ్ కుమార్ పాత్రను ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత
- కేంద్ర మంత్రి లలన్ సింగ్ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం



ఆటోమోటివ్, ఈవీ రంగాల్లో
పెట్టుబడులే లక్ష్యం

11న మంత్రి పొన్నం అధ్యక్షతన తొలి సమావేశం!

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్): తెలంగాణ రాష్ట్రాన్ని ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) రంగాల్లో దేశంలోనే అగ్రగామి పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే మహోన్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించింది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' సన్నాహకాల్లో భాగంగా ఆటోమోటివ్, ఈవీ రంగానికి సంబంధించి కీలకమైన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ)ను ఏర్పాటు చేసింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రూపుదిద్దుకున్న ఈ కౌన్సిల్‌లో ఆటోమోటివ్, ఈవీ రంగాలకు చెందిన దిగ్గజ కంపెనీలు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రముఖ వాటాదారులు సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఇప్పటికే సుమారు 25 మందికి పైగా పారిశ్రామిక ప్రతినిధులు ఈ కౌన్సిల్‌లో భాగస్వాములయ్యేందుకు తమ పూర్తి అంగీకారాన్ని తెలియజేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సచివాలయంలోని మినిస్టర్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈనెల 11న మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఆటోమోటివ్, ఈవీ రంగం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశాన్ని హైబ్రిడ్ (ప్రత్యక్ష, ఆన్‌లైన్) విధానంలో నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కీలక సమావేశంలో తెలంగాణలో భారీ పెట్టుబడుల అవకాశాలు, ప్రస్తుతం కొనసాగుతున్న పరిశ్రమల ప్రాజెక్టులు, నూతన పెట్టుబడి ప్రతిపాదనలు, కంపెనీల విస్తరణ ప్రణాళికలతో పాటు భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై పరిశ్రమల ప్రతినిధులతో నేరుగా చర్చించనున్నారు. రాష్ట్రంలో ఆటోమోటివ్, ఈవీ రంగాలకు చెందిన ప్రధాన కంపెనీల పెట్టుబడులు, కొత్త ప్రాజెక్టులు, విస్తరణ ప్రణాళికలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026తో పాటు నిర్వహించే ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌పోలో ప్రముఖ కంపెనీలన్నీ చురుకుగా పాల్గొనేలా ఆహ్వానించడం. పరిశ్రమల వేగవంతమైన అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ అనుకూల విధానాలు, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర సమస్యలపై పరిశ్రమల ప్రతినిధుల నుంచి విలువైన సూచనలు, సలహాలు స్వీకరించడం. గ్లోబల్ సమ్మిట్‌లో ఆటోమోటివ్, ఈవీ రంగాలకు సంబంధించి నిర్వహించే ప్రత్యేక చర్చా వేదికల అంశాలను ఖరారు చేయడం. ప్రభుత్వం, పరిశ్రమల మధ్య పటిష్ట సమన్వయం, భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని సిద్ధం చేయడం. ఈ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పరిశ్రమలు, వాణిజ్య శాఖకు చెందిన లాజిస్టిక్స్, సప్లై చైన్, ఆటోమోటివ్, ఈవీ విభాగం డైరెక్టర్ ఔజాద్ షేక్ సంబంధిత సిబ్బంది బృందాలతో నిరంతరం సమన్వయం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు సమాచార, పౌర సంబంధాల శాఖ, పరిశ్రమల శాఖ మీడియా, కమ్యూనికేషన్స్ విభాగాలు ఈ ప్రతిష్టాత్మక సమావేశానికి విస్తృత ప్రచారం కల్పించేలా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాయి. ఆటోమోటివ్, ఈవీ రంగంలో ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు ఆకర్షించడంతో పాటు పరిశ్రమల ప్రముఖుల ప్రత్యక్ష భాగస్వామ్యంతో రంగాల అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణను రూపొందించేందుకు ఈ ఈసీ సమావేశం అత్యంత కీలకం కానుంది.

మైనారిటీల అభ్యున్నతికి పెద్దపీట

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్): మైనారిటీల అభ్యున్నతికి ప్రజాప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారి సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ అవసరమైన నిధులు వెచ్చిస్తోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాల కల్పనతోపాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. గత అసెంబ్లీ సమావేశంలో మైనారిటీల అభ్యున్నతి గురించి సమీక్ష నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీలో భాగంగా మైనారిటీ సంక్షేమ శాఖపై ప్రజాభవన్‌లో విక్రమార్క శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మైనారిటీల విద్యాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, విద్యాసంస్థల నిర్మాణాలు, స్టడీ సర్కిళ్ల ఏర్పాటు, ఓల్డ్ సిటీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మైనారిటీలకు విద్యావకాశాలను మరింత విస్తృతం చేసేందుకు నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం, ఆంక్షలు ఉండబోవని భరోసా ఇచ్చారు. హజ్‌హౌస్ పక్కన అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కార్యాచరణను రూపొందించాలని ఆదేశించారు. వివిధ రహదారుల విస్తరణ పనుల కోసం వినియోగించిన వక్ఫ్ భూములకు సంబంధించి జీహెచ్ఎంసీ నుంచి వక్ఫ్ బోర్డుకు రావాల్సిన నిధుల్లో రూ.25 కోట్లను ఈ భవన నిర్మాణానికి కేటాయించాలని ఆదేశించారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఈ భవనంలో స్టడీ సర్కిల్‌తోపాటు మైనారిటీ సంక్షేమ శాఖకు చెందిన వివిధ కార్యాలయాలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యాసంస్థల భవన నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో జాప్యం ఉండదని స్పష్టం చేశారు. మైనారిటీల విద్యాభివృద్ధికి దోహదపడే పాఠశాలలు, స్టడీ సర్కిళ్లు, ఇతర విద్యాసంస్థలకు అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. మొఘల్‌పురా, బండ్లగూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన రెండు స్టడీ సర్కిళ్లకు సంబంధించి ఉన్న అడ్డంకులను తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. వీటి నిర్వహణకు అవసరమైన భవనాలను అందించేందుకు అక్బరుద్దీన్ ఒవైసీ సంసిద్ధత వ్యక్తం చేయగా ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారికంగా సమర్పించాలని కోరారు. మైనారిటీ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్య అభ్యాసానికి మరిన్ని అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం పరిధిని విస్తరిస్తున్నట్టు చెప్పారు. ఈ పథకం కింద అర్హులైన విద్యార్థులు వెళ్లగలిగే విదేశాల జాబితాలో ఈజిప్ట్, సౌదీ అరేబియాలను చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. సమావేశంలో శాసనసభలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, కార్యదర్శి బి.షఫీఉల్లా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హస్తంలో అసంతృప్తి సెగలు!

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అభివృద్ధి నిధుల విషయంలో అధికార పార్టీ ఎమ్మెల్యే నుంచే ఇటువంటి హెచ్చరిక రావడం ప్రభుత్వంలో సమన్వయంపై ప్రశ్నలకు దారితీసింది. నియోజకవర్గాల అభివృద్ధి పనులకు నిధుల విడుదల, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు అనుమతులు, స్థానిక అవసరాలకు ప్రాధాన్యం వంటి అంశాలపై మరికొందరు ప్రజాప్రతినిధుల్లోనూ అసంతృప్తి ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నప్పటికీ తమ నియోజకవర్గాలకు ఆశించిన స్థాయిలో నిధులు అందడం లేదని కొందరు ఎమ్మెల్యేలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే నిధుల కేటాయింపులో వివక్ష జరుగుతోందన్న ఆరోపణలపై ప్రభుత్వ అధికారిక వివరణ అవసరం. జిల్లాల స్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య రాజకీయ ఆధిపత్యానికి సంబంధించిన విభేదాలు కూడా చర్చనీయాంశమవుతున్నాయి. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య ఢిల్లీలోని ఓ హోటల్‌లో వివాదం చోటుచేసుకున్నట్లు వచ్చిన కథనాలు పార్టీలో కలకలం రేపాయి. నామినేటెడ్ పదవులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలు, స్థానిక రాజకీయ వ్యవహారాల్లో ప్రాధాన్యం వంటి అంశాలపై విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరిగింది. అయితే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ఇరువురు నాయకుల వాదనలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. రాష్ట్రస్థాయిలో పరిష్కరించుకోవాల్సిన విభేదాలు జాతీయ నాయకత్వం దృష్టికి వెళ్లడం పార్టీ అంతర్గత సమన్వయంపై చర్చకు దారితీస్తోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పనితీరుపైనా కొన్ని వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ నిర్ణయాలను బహిరంగంగా ప్రశ్నించే నాయకుల విషయంలో ఒకే విధమైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కిందిస్థాయి నాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ మంత్రులు, ఎమ్మెల్యేల విషయంలో నాయకత్వం ఆచితూచి వ్యవహరిస్తోందని కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అయితే క్రమశిక్షణ చర్యల విషయంలో పార్టీ నాయకత్వం అనుసరిస్తున్న విధానంపై అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. పార్టీలో తలెత్తే సమస్యలను అంతర్గత చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు సమన్వయ కమిటీలు ఉన్నప్పటికీ ఆశించిన ఫలితాలు కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పదవుల పంపిణీ, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, జిల్లా స్థాయి నియామకాలు వంటి అంశాల్లో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోందని కొందరు నేతలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాష్ట్ర నాయకత్వం వద్ద పరిష్కారం లభించని అంశాలను నేరుగా ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్తున్నారనే చర్చ కూడా సాగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న కొందరు సీనియర్ నాయకులు తమ అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే పార్టీలోని ప్రతి అసంతృప్తి వెనుక ముఖ్యమంత్రి నాయకత్వాన్ని వ్యతిరేకించే ఉద్దేశమే ఉందని భావించలేమని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. స్థానిక రాజకీయ సమీకరణాలు, అభివృద్ధి పనుల ప్రాధాన్యాలు, పదవులపై ఆశలు వంటి అంశాలు కూడా విభేదాలకు కారణమయ్యే అవకాశముందని విశ్లేషిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సీఎం రేవంత్



రెడ్డితోపాటు టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్‌కు పార్టీ నేతల మధ్య సమన్వయం పెంపొందించడం కీలక బాధ్యతగా మారిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యేలు, మంత్రులు, జిల్లా నాయకత్వం మధ్య తలెత్తుతున్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు లేవనెత్తుతున్న అభివృద్ధి సమస్యలను పరిశీలించడంతోపాటు పదవుల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కొందరు నేతలు కోరుతున్నారు. అధికార పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమే అయినప్పటికీ అవి బహిరంగ వివాదాలుగా మారుతున్నాయన్న చర్చ కాంగ్రెస్ నాయకత్వానికి కొత్త సవాలుగా నిలుస్తోంది. ప్రస్తుతం వినిపిస్తున్న విమర్శలపై పార్టీ అధిష్ఠానం ఎలా స్పందిస్తుంది? అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నాయకులతో చర్చలు జరుపుతుందా? నిధులు, పదవుల పంపిణీపై స్పష్టత ఇస్తుందా? అన్న అంశాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. అంతర్గత సమస్యలను పరిష్కరించి పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

వంద దేశాలకు వేదికగా హైదరాబాద్!

- **12 నుంచి అంతర్జాతీయ భారత్ సమ్మిట్**
- **హైటెక్స్‌లో సదస్సుకు భారీ ఏర్పాట్లు**
- **100 దేశాల నుంచి ప్రతినిధులు**
- **450 మంది ప్రముఖులకు ఆహ్వానాలు**
- **కేంద్ర మంత్రులు, ఎంపీ శశి థరూర్ సహా పలువురు ప్రముఖుల రాక**
- **దౌత్య, ఆర్థిక సంబంధాల బలోపేతమే లక్ష్యం**



హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్): అంతర్జాతీయ సదస్సులకు వేదికగా నిలుస్తున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజులపాటు నగరంలోని హైటెక్స్‌లో అంతర్జాతీయ భారత్ సమ్మిట్ నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో జరగనున్న ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా సుమారు 100 దేశాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నట్లు సమాచారం. వివిధ రంగాలకు చెందిన 450 మంది అంతర్జాతీయ ప్రముఖులకు ఇప్పటికే ఆహ్వానాలు పంపించారు. ప్రపంచ దేశాల మధ్య దౌత్య, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతోపాటు పరస్పర సహకారాన్ని విస్తరించడమే ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు పేర్కొంటున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో పలువురు కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పార్లమెంటు సభ్యుడు శశి థరూర్‌తోపాటు వివిధ దేశాలకు చెందిన దౌత్యవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక, దౌత్య రంగాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై చర్చించేందుకు ఈ వేదికను వినియోగించుకోనున్నారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలు, వివిధ దేశాల మధ్య సంబంధాల విస్తరణ వంటి అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. ప్రపంచ దేశాల మధ్య మారుతున్న ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు, పెట్టుబడుల అవకాశాలు, పరస్పర సహకారానికి సంబంధించిన అంశాలపై సదస్సులో అభిప్రాయాలను పంచుకోనున్నారు. వివిధ దేశాల ప్రతినిధులు ఒకే వేదికపై సమావేశమవడం ద్వారా ద్వైపాక్షిక, బహుళపాక్షిక సంబంధాల బలోపేతానికి అవకాశాలు ఏర్పడతాయని నిర్వాహకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు దేశాల మధ్య సహకారం అవసరమనే అంశంపై కూడా చర్చలు జరిగే అవకాశముంది. ఈ సదస్సుకు వివిధ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో నిర్వాహకులు ఏర్పాట్లపై దృష్టి సారించారు. హైటెక్స్‌లో సమావేశాల నిర్వహణ, విదేశీ ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, రవాణా, భద్రత తదితర అంశాలపై సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీయ ప్రతినిధుల రాకను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు, సాంకేతిక సదస్సులు, పారిశ్రామిక ప్రదర్శనలకు కేంద్రంగా గుర్తింపు పొందిన హైదరాబాద్‌కు భారత్ సమ్మిట్ ద్వారా మరోసారి అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యం లభించనుంది. వంద దేశాల ప్రతినిధులు ఒకే వేదికపై సమావేశమవడం నగరానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురాగలదని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో చర్చించే అంశాలు, అంతర్జాతీయ ప్రతినిధుల భాగస్వామ్యం, పరస్పర సహకారంపై తీసుకునే నిర్ణయాలు ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. ప్రపంచ దేశాల మధ్య సంబంధాలను మరింత విస్తరించేందుకు హైదరాబాద్ వేదికగా జరగనున్న భారత్ సమ్మిట్ ఉపయోగపడుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు.

బతికుండగానే శ్మశానవాటికకు..!

- **వేములవాడలో హృదయవిదారక ఘటన..**
- **వ్యక్తికి కిరాయి ఇంట్లోనూ దక్కని ఆశ్రయం**
- **ఇంటి యజమాని నిరాకరణతో తప్పని దుస్థితి**
- **ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించి ఆదుకోవాలని వేడుకోలు**





వేములవాడ, నవంబర్ 6 (సమయం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో అత్యంత హృదయవిదారకమైన పరిణామం చోటుచేసుకుంది. తీవ్ర అనారోగ్యంతో ప్రాణాలతో పోరాడుతున్న ఒక వ్యక్తికి కనీసం నివసించే అద్దె ఇంట్లో కూడా ఆశ్రయం లభించకపోవడంతో, చేసేదేమీ లేక కుటుంబ సభ్యులు అతడిని వేములవాడలోని శ్మశానవాటికకు తీసుకెళ్లారు. ప్రాణముండగానే శ్మశానంలోనే అతడికి ఆశ్రయం కల్పించిన ఈ దయనీయ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపడమే కాకుండా, మానవత్వం మంటగలిసిందనడానికి నిదర్శనంగా నిలుస్తోంది. బాధితుడు మర్రిపల్లి రాకేష్ కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ముదిరిన జాండీస్‌తో పాటు తీవ్ర శ్వాస సంబంధిత వ్యాధులతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాడు. అతడికి మెరుగైన వైద్యం అందించడం కోసం కుటుంబ సభ్యులు తమ వద్ద ఉన్నంతలో అనేక ఆస్పత్రుల చుట్టూ తిరిగినప్పటికీ, రాకేష్ ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మెరుగుదల రాలేదు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించి ప్రాణాపాయ స్థితికి చేరింది. ఈ క్రమంలో వారు నివాసముంటున్న కిరాయి ఇంట్లోకి రాకేష్‌ను తీసుకురావడానికి ఇంటి యజమాని ఎంతమాత్రం అనుమతించలేదు. ఇప్పటికే తీవ్ర అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తమకు ఎక్కడా కనీస ఆశ్రయం కూడా లభించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో వేములవాడలోని శ్మశానవాటికకు చేరుకున్నారు. ప్రస్తుతం ఆ శ్మశానంలోనే రాకేష్‌ను పండబెట్టి బాగోగులు చూసుకుంటున్నారు. ప్రాణాలతో బతికుండగానే తమ కుటుంబం శ్మశానవాటికలో కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి వచ్చిందని బాధితుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి నివాసం కూడా దక్కకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ దుస్థితిని గుర్తించి స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెంటనే స్పందించాలని బాధిత కుటుంబం దీనంగా వేడుకుంటోంది. ప్రాణాలతో పోరాడుతున్న రాకేష్‌కు తక్షణమే మెరుగైన ఉచిత వైద్యం అందించడంతో పాటు తమ కుటుంబానికి నివాస వసతి, ఆర్థిక సహాయం కల్పించాలని విన్నవిస్తున్నారు.

పుష్కర పనుల్లో ఆలస్యం జరగొద్దు

- భక్తులకు అన్ని వసతులు కల్పించాలి
- అధికారులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్



హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్) : గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. తొలుత పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి తదితర ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ఇప్పటికే పూర్తయిన, ఇంకా ప్రారంభం కావాల్సినవి, వివిధ దశల్లో కొనసాగుతున్న పనులపై సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ అండ్ కమిషనర్ ఎం.హనుమంతరావు, జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్‌తోపాటు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు, వివిధ విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు రాష్ట్రానికి ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా ఎంతో ప్రాధాన్యమైనవని, ధర్మపురి వంటి పుణ్యక్షేత్రాలకు రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని చెప్పారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా రహదారులు, పుష్కర ఘాట్లు, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్తు, వైద్య సదుపాయాలు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను సమగ్రంగా కల్పించాలని సూచించారు. పుష్కరాల పనుల్లో ఇరిగేషన్, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాలు, దేవాదాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఒక శాఖ పనుల వల్ల మరో శాఖ పనులకు ఆటంకం కలగకుండా ముందస్తు కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతీ పనికి సంబంధించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని మంత్రి సూచించారు. పూర్తయిన పనుల వివరాలు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతి, ఇంకా ప్రారంభం కావాల్సిన పనులు, వాటి అంచనా వ్యయం, పూర్తి చేయాల్సిన గడువులతో కూడిన నివేదికను సిద్ధం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు తరచూ పర్యటిస్తూ పనుల నాణ్యతను పరిశీలించాలని, కాంట్రాక్టర్లు నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా చూడాలని ఆదేశించారు. ప్రత్యేకించి పుష్కర ఘాట్లలో భక్తులు సురక్షితంగా పుణ్యస్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలకు ప్రత్యేక మార్గాల రూపకల్పనపై దృష్టి సారించాలన్నారు. పుష్కరాల సమయంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, నది పరిశుభ్రతను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. భక్తులకు తాగునీరు, ఆహారం, విశ్రాంతి కేంద్రాలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వారి అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని సూచించారు.

ధర్మపురి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ధర్మపురి, కోటిలింగాల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. పుష్కరాల కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1,000 కోట్ల నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ధర్మపురి ప్రాంతంలో సుమారు రూ.226 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టే ప్రణాళికలో భాగంగా పుష్కర ఘాట్లు, రహదారులు, పార్కింగ్ తదితర సదుపాయాల కల్పనకు చర్యలు కొనసాగుతున్నాయి. ధర్మపురిలో సుమారు 470 మీటర్ల మేర కొత్త స్నాన ఘాట్ల అభివృద్ధి కూడా ప్రతిపాదిత పనుల్లో ఉంది. జూన్ 26 నుంచి జూలై 7 వరకు పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఆలోగా అన్ని శాశ్వత, తాత్కాలిక పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగాలని మంత్రి స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ అవినీతి దాహానికి బలైన కాళేశ్వరం

- వినియోగంలోకి రాకముందే కూలిన ఏకైక ప్రాజెక్టు
- 'పల్లె పల్లెకు సీతక్క'లో భాగంగా ములుగు నియోజకవర్గంలో పర్యటన



ములుగు, నవంబర్ 6 (సమయం న్యూస్) : బీఆర్ఎస్ అవినీతి దాహానికి కాళేశ్వరం ప్రాజెక్టు బలి అయిందని మంత్రి సీతక్క ఆరోపించారు. పల్లె పల్లెకు సీతక్క కార్యక్రమంలో భాగంగా ములుగు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. తొలుత రామప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాలకు చేరుకున్న మంత్రికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పలు గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించిన మంత్రి ప్రజలతో మమేకమయ్యారు. గ్రామాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలు, అవినీతి కారణంగానే నిర్మాణం పూర్తయిన కొద్ది కాలానికే బ్యారేజీ దెబ్బతిన్నదని విమర్శించారు. రూ.లక్షల కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు పరిస్థితి నేడు ఎలా ఉందో ప్రజలకు తెలుసన్నారు. కాళేశ్వరంబీళి రాజకీయాలు చేయడం మాని వాస్తవాలను బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు వివరించాలని సూచించారు. కాళేశ్వరం వద్ద నీటిని నిల్వ చేస్తే ప్రమాదం ఉందని కేంద్ర డ్యామ్ సేఫ్టీ అధికారులు సూచించారని మంత్రి తెలిపారు. కన్నాయిగూడెం, ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం ప్రాంతాలతోపాటు పినపాక, భద్రాద్రి ప్రాంతాలకు వరద ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్న అధికారుల హెచ్చరికల నేపథ్యంలోనే నీటి నిల్వ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. గోదావరి జలాలు వృథా కాకుండా వివిధ మార్గాల ద్వారా అవసరమైన ప్రాంతాలకు తరలిస్తున్నామని సీతక్క తెలిపారు. దేవాదుల, తుపాకులగూడెం ప్రాజెక్టుల ద్వారా నీటిని వినియోగించుకునే చర్యలు చేపడుతున్నామని, నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు సీతారామ ప్రాజెక్టులో నీటిని నింపుతూ అవసరమైన విధంగా వినియోగిస్తున్నామని చెప్పారు. రామప్ప చెరువును నింపడంతోపాటు, అక్కడినుంచి పరిసర మండలాలకు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో తాగు, సాగునీటి అవసరాలు ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నదే ప్రభుత్వ విధానమన్నారు. గోదావరిలో లభ్యమయ్యే ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి రైతులకు, ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. నీటి నిర్వహణకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. దేశంలోని అనేక ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఇది ప్రకృతిలో వచ్చిన మార్పుల ఫలితమని, ఈ క్లిష్ట పరిస్థితుల్లో రైతులు, పేదలకు అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు, ఇబ్బందులను స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని సీతక్క తెలిపారు. సన్న వడ్ల సాగు విషయంలో గతంలో బీఆర్ఎస్ అనేక విమర్శలు చేసినప్పటికీ నేడు సన్న బియ్యాన్ని ప్రజలకు అందించే స్థాయికి రాష్ట్రం చేరుకుందని గుర్తు చేశారు. రైతుల పంటకు గిట్టుబాటు, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడం రెండింటికీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతుల కష్టాలను గుర్తించి వారికి సహకారం అందించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు..

మంత్రి పొన్నం సీరియస్!.. ఘటనపై విచారణకు ఆదేశం



హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్) : సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) వ్యవహారశైలిపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. కార్మికులతో సమావేశమైన సమయంలో డీఎం కుర్చీలో కూర్చోగా, కార్మికులు నేలపై కూర్చున్నట్లుగా ప్రచారంలోకి వచ్చిన ఘటనపై ఆయన పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "సిద్దిపేట డిపోలో జరిగిన ఘటన నా దృష్టికి వచ్చింది. ఈ అంశంపై తక్షణమే ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించాను. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మగౌరవానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. "ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకం. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను గౌరవంగా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంది. వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా సహించే ప్రసక్తే లేదు" అని మంత్రి స్పష్టం చేశారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా, అగౌరవంగా ప్రవర్తించే అధికారులపై భవిష్యత్తులో కఠిన చర్యలు తప్పవని పొన్నం ప్రభాకర్ గట్టిగా హెచ్చరించారు. అధికారులు తమ పరిధిలో కార్మికులతో గౌరవప్రదంగా, బాధ్యతాయుతంగా మెలగాలని ఆయన హితవు పలికారు.

తల్లిదండ్రుల జీతం మాత్రమే ప్రాతిపదిక కాదు

ఉద్యోగ హోదా, పోస్టు కేటగిరీ పరిశీలన తప్పనిసరి

ఓబీసీ క్రీమీలేయర్‌పై సుప్రీంకోర్టు కీలక స్పష్టత!

న్యూఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్): ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) క్రీమీలేయర్ అర్హత నిర్ణయంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన స్పష్టత ఇచ్చింది. కేవలం తల్లిదండ్రుల వార్షిక జీతాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని అభ్యర్థులను క్రీమీలేయర్ పరిధిలోకి తీసుకురావడం ఎంతమాత్రం సరికాదని ధర్మాసనం స్పష్టం చేసింది. వారి ఉద్యోగ హోదా, పోస్టు కేటగిరీని కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. అయితే ఇప్పటికే పూర్తయిన ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు, సీనియారిటీపై ఈ తీర్పు ప్రభావం ఏమాత్రం ఉండదని స్పష్టం చేసింది. 1993 ఆగస్టు 8న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారమే క్రీమీలేయర్ అర్హతను నిర్ణయించాలని కోర్టు ఆదేశించింది. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పిల్లలకు కూడా సమాన హోదా ఆధారంగా నిబంధనలు వర్తింపజేయాలని సూచించింది. మార్చి 11, 2026న ఇచ్చిన తీర్పుపై కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన వివరణ పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం.. ఇప్పటికే పూర్తయిన ఉద్యోగ నియామకాలు, ఎంపికలు, పదోన్నతులు, సీనియారిటీని తిరిగి సమీక్షించేందుకు ఈ తీర్పును ఆధారంగా చేసుకోరాదని తేల్చిచెప్పింది. అయితే పెండింగ్‌లో ఉన్న కేసులను మాత్రం సంబంధిత న్యాయస్థానాలు వాటి మెరిట్స్ ఆధారంగా నిర్ణయించవచ్చని తెలిపింది. సివిల్ సర్వీసెస్ పరీక్ష-2025 ద్వారా ఎంపికైన 958 మంది అభ్యర్థులకు మాత్రం ఈ తాజా మార్గదర్శకాలు వర్తిస్తాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వీరికి ఇంకా సర్వీసుల కేటాయింపు ప్రక్రియ పూర్తికానందున కొత్త నిబంధనల ప్రకారమే క్రీమీలేయర్ అర్హతను నిర్ణయించాలని ఆదేశించింది. భవిష్యత్తులో చేపట్టే అన్ని రకాల ఉద్యోగ నియామకాలు, ఎంపికలు, రోస్టర్ కేటాయింపుల్లోనూ ఈ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని తెలిపింది. అలాగే క్రీమీలేయర్ విధానంపై కాలానికనుగుణంగా కొత్త పాలసీ రూపొందించుకునే పూర్తి అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని ధర్మాసనం పేర్కొంది.



బీఆర్ఎస్ నేత దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్ట్

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్) : బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రాజకీయ విమర్శలకు పోలీసు కేసులతో బదులివ్వడం దుర్మార్గమని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ భార్య ఇందుజా రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బాలరాజు యాదవ్‌ను అరెస్టు చేశారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. కేటీఆర్, హరీశ్ రావులపై బల్మూర్ వెంకట్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బాలరాజు యాదవ్ ఇటీవల మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై అట్రాసిటీ కేసు పెట్టడం రాజకీయ కక్ష సాధింపేనని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ అరెస్టుపై కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప పోలీసు కేసులతో కాదు. అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను సిటీ అంతా తిప్పుతూ ఆయన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరు" అని కేటీఆర్ పేర్కొన్నారు. బాలరాజు యాదవ్‌పై పెట్టిన కేసును తక్షణమే ఉపసంహరించుకుని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కాలరాయలేరని హితవు పలికారు. ఈ అరెస్టును బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కూడా ఖండించారు.

60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు..

ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే

రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్



హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్) : రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. "ఇది అతివృష్టి కాదు.. అనావృష్టి కాదు.. రేవంత్ వృష్టి" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా.. పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే.. ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసిపట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని పేర్కొన్నారు. గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

బీఆర్ఎస్ రైతు గర్జన పోస్టర్ ఆవిష్కరణ..

ఈ నెల 11న నిర్మల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రైతు గర్జన సభకు పార్టీ నాయకులు సన్నాహాలు ముమ్మరం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్మల్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు సంబంధించిన పోస్టర్‌ను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం సభా ప్రాంగణానికి చేరుకుని ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతు గర్జన సభను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు, సభా ప్రాంగణంలో చేపట్టాల్సిన సౌకర్యాలు, ఇతర నిర్వహణ అంశాలపై నాయకులు పరిశీలించారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సమన్వయం చేసుకోవాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ముధోల్ నియోజకవర్గ సమన్వయకర్తలు లోలం శ్యాంసుందర్, రమాదేవి, కిరణ్ కోమ్రేవార్, విలాస్ గాదేవర్, నిర్మల్ నియోజకవర్గ నాయకుడు నల్ల వినయ్ రెడ్డితో పాటు మూడు నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



సంపాదకీయం



స్టాక్ మార్కెట్‌లో లాభాల జాతర!

ఒక్కరోజే 1,718 పాయింట్లు దూసుకెళ్లిన సెన్సెక్స్

మళ్లీ 25 వేల మార్కును అధిగమించిన నిఫ్టీ

వరుసగా ఏడో రోజూ లాభాల్లో ముగిసిన దేశీయ సూచీలు

భారీగా కొనుగోళ్లకు దిగిన విదేశీ సంస్థాగత మదుపర్లు

ఒక్కరోజే రూ.14,975 కోట్ల విదేశీ పెట్టుబడులు

బ్యాంకింగ్, ఆటోమొబైల్ షేర్లకు భారీగా కొనుగోళ్ల మద్దతు

ముంబయి, నవంబర్ 6 (సమయం న్యూస్): దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు ఎదురైనప్పటికీ భారతీయ సూచీలు దూకుడు ప్రదర్శించాయి. వరుసగా ఏడో ట్రేడింగ్ రోజూ లాభాలను నమోదు చేస్తూ మదుపర్లలో ఉత్సాహాన్ని నింపాయి. విదేశీ సంస్థాగత మదుపర్ల భారీ కొనుగోళ్లు, ప్రముఖ కంపెనీల మెరుగైన త్రైమాసిక ఫలితాలు, బ్యాంకింగ్, ఆటోమొబైల్ రంగాల షేర్లకు పెరిగిన డిమాండ్ సూచీల పరుగుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ క్రమంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ ఏకంగా 1,718.01 పాయింట్లు ఎగబాకగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ మళ్లీ 25 వేల పాయింట్ల కీలక స్థాయిని అధిగమించింది. గురువారం 79,310.01 పాయింట్ల వద్ద ముగిసిన సెన్సెక్స్ శుక్రవారం ఉదయం 79,413.66 పాయింట్ల వద్ద స్వల్ప లాభంతో ట్రేడింగ్ ప్రారంభించింది. ప్రారంభంలో కొంత అప్రమత్తత కనిపించినప్పటికీ కొద్దిసేపటికే కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటోమొబైల్, వినియోగ వస్తువుల రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీల షేర్లలో కొనుగోళ్ల మద్దతు పెరగడంతో సూచీ వేగంగా పుంజుకుంది. చివరకు సెన్సెక్స్ 1,718.01 పాయింట్ల భారీ లాభంతో 81,028.02 పాయింట్ల వద్ద ముగిసింది. ఇదే సమయంలో నిఫ్టీ 493.75 పాయింట్లు పెరిగి 25,030 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93.89గా నమోదైంది. సెన్సెక్స్‌లోని 30 ప్రధాన కంపెనీల షేర్లలో పవర్‌గ్రిడ్ మినహా మిగిలినవన్నీ లాభాల్లో ముగియడం విశేషం. మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా రాణించాయి. బ్యాంకింగ్ రంగంలోని దిగ్గజ సంస్థల షేర్లకు భారీగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల పెరుగుదలకు బలమైన ఊతం లభించింది. ఆటోమొబైల్, ఇతర ప్రముఖ కంపెనీల షేర్లు కూడా లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో కృత్రిమ మేధ రంగానికి సంబంధించిన కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్న సమయంలో భారత మార్కెట్లు విభిన్నంగా స్పందించడం విశేషంగా మారింది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కృత్రిమ మేధ సాంకేతికతపై నియంత్రణలు కఠినతరం కావచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా కొన్ని సాంకేతిక రంగ కంపెనీల షేర్లపై ఒత్తిడి పెరిగినట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే కృత్రిమ మేధ రంగంపై అధికంగా ఆధారపడిన మార్కెట్లతో పోలిస్తే భారతీయ మార్కెట్లలో ఇతర రంగాల కంపెనీలకు ప్రాధాన్యం ఉండటం పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడుతోందని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాన్ని మార్కెట్ వర్గాలు 'యాంటీ ఏఐ' ధోరణిగా అభివర్ణిస్తున్నాయి. దేశీయ సూచీల భారీ పెరుగుదలకు విదేశీ సంస్థాగత మదుపర్ల కొనుగోళ్లు మరో ప్రధాన కారణంగా నిలిచాయి. గురువారం ఒక్కరోజే విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.14,975 కోట్ల విలువైన షేర్లను నికరంగా కొనుగోలు చేసినట్లు మార్కెట్ గణాంకాలు వెల్లడించాయి. గత ఆరేళ్లలో ఒకేరోజు ఈ స్థాయిలో విదేశీ పెట్టుబడులు రావడం ఇదే తొలిసారి అని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరగడంతో దేశీయ మదుపర్లలోనూ విశ్వాసం బలపడింది. ముఖ్యంగా భారీ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల షేర్లకు డిమాండ్ పెరిగింది. మరోవైపు కంపెనీల రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు కూడా మార్కెట్‌కు అనుకూలంగా మారాయి. పలు ప్రముఖ కంపెనీలు అంచనాల కంటే మెరుగైన ఫలితాలను ప్రకటించడం మదుపర్లలో సానుకూల ధోరణిని పెంచింది. గత కొంతకాలంగా ధరలు తగ్గిన భారీ కంపెనీల షేర్లు ప్రస్తుత స్థాయిల్లో ఆకర్షణీయంగా కనిపిస్తుండటంతో పెట్టుబడిదారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటోమొబైల్ రంగాల్లో కొనుగోళ్లు పెరగడం సూచీలకు కలిసొచ్చింది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారత మార్కెట్లు వరుసగా ఏడో రోజు లాభాలను నమోదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఒక్కరోజు భారీ పెరుగుదల నమోదైనంత మాత్రాన ఇదే ధోరణి నిరంతరం కొనసాగుతుందని చెప్పలేమని మార్కెట్ నిపుణులు గుర్తుచేస్తున్నారు. అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, కంపెనీల ఆర్థిక ఫలితాలు, వడ్డీ రేట్లపై నిర్ణయాలు రాబోయే రోజుల్లో సూచీల గమనాన్ని ప్రభావితం చేసే అవకాశముంది. ప్రస్తుతానికి మాత్రం సెన్సెక్స్ భారీ పరుగుతో, నిఫ్టీ 25 వేల మార్కు అధిగమనంతో దేశీయ స్టాక్ మార్కెట్లలో ఉత్సాహం నెలకొంది.



ప్రభుత్వ పథకాల లబ్ధికి ఓటర్ ఐడీ

- **బీజేపీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు!**
- **ఓటర్ల జాబితాల ఆధారంగా లబ్ధిదారుల ఎంపికపై అభ్యంతరం**
- **ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై మరోసారి విమర్శలు**
- **జ్ఞానేశ్ కుమార్ పాత్రను ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత**
- **కేంద్ర మంత్రి లలన్ సింగ్ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం**



న్యూదిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్) : కేంద్రంలో శాశ్వతంగా అధికారంలో కొనసాగేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికలను తారుమారు చేసి ప్రజల ప్రాథమిక ఓటు హక్కును, హక్కులను హరించేందుకు పెద్ద కుట్ర పన్నుతోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను నిర్ధారించడానికి ఇకపై ఆధార్ కార్డులకు బదులుగా ఓటర్ ఐడీ కార్డులను, బయోమెట్రిక్‌ను ఉపయోగిస్తామని కేంద్ర మంత్రి లలన్ సింగ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ గాంధీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు.ఆధార్‌కు బదులుగా ఓటర్ ఐడీ ఆధారంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేయడం పౌరుల ప్రాథమిక హక్కులకు తీరని ముప్పు కలిగిస్తుందని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలను పొందడాన్ని ఓటర్ల జాబితాలతో ముడిపెడుతున్నారని, అయితే ఆ జాబితాలను ఇప్పటికే ప్రభుత్వం తన అనుకూలంగా తారుమారు చేస్తోందని ఆరోపించారు. బీజేపీని వ్యతిరేకించే లేదా నిలదీసే లక్షలాది మంది ఓటర్ల పేర్లను తొలగించడానికి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ర్×=)ను నిరంతరం ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీపై ఆగ్రహంతో ఉన్న ప్రజలనే లక్ష్యంగా చేసుకుని ఓట్ల నుంచి తొలగించి, సంక్షేమ పథకాల ప్రయోజనాలను కూడా నిరాకరించే పరిస్థితిని కల్పిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలను ప్రభుత్వం పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకుందన్న రాహుల్ గాంధీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పాత్రనూ ప్రత్యక్షంగా ప్రశ్నించారు. "ఓటర్ల జాబితాలు నిష్పక్షపాతంగా వ్యవహరించే స్వతంత్ర ఎన్నికల సంఘం చేతిలో ఉండాలి. కానీ ఇప్పుడు అవి మోదీ ప్రభుత్వ ప్రతినిధి జ్ఞానేశ్ కుమార్ చేతిలో ఉన్నాయి. ఓట్ల చోరీలో బీజేపీతో కుమ్మక్కైన ఆయనను ఆధారాలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం" అని విమర్శించారు. ఎల్లప్పుడూ బీజేపీకే మెజారిటీ వచ్చేలా జాబితాను రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని, ఇప్పుడు అదే జాబితా పేదలకు పథకాలు అందాలో లేదో నిర్ణయించడం హైజాక్ చేయబడిన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని అన్నారు. ఇక్కడ ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం లేదని, ప్రభుత్వమే తనకు అనుకూలమైన ప్రజలను ఎన్నుకుంటోందని ఆయన ఆరోపించారు. కాగా, రాహుల్ గాంధీ తన పోస్టుతో పాటు షేర్ చేసిన వీడియోలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి లలన్ సింగ్ మాట్లాడారు. "ఇకపై లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల చెల్లింపుల కోసం ఆధార్ కార్డు ప్రాతిపదికగా ఉండదు. ప్రతి వీధిలోని సంస్థల్లో ఇప్పుడు ఆధార్ కార్డు అందుబాటులో ఉంది. వారిని అడిగితే చాలు, ఐదు నిమిషాల్లో మీకు నకిలీ ఆధార్ కార్డును కూడా సిద్ధం చేసి ఇస్తారు. కాబట్టి ఇకపై ఆధార్ కార్డు ప్రాతిపదిక కానే కాదు. లబ్ధిదారులందరికీ చెల్లింపుల కోసం బయోమెట్రిక్, ఓటర్ ఐడీ నంబరే ప్రధాన ప్రాతిపదికగా ఉంటాయి. వాటి ఆధారంగానే సంక్షేమ నిధుల చెల్లింపులు జరుగుతాయి" అని వెల్లడించారు.



దీపావళి వేడుకల్లో బాధ్యత అవసరం

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు!

న్యూ ఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్) : ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో ప్రమాదకరంగా పెరిగిన వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం కోర్టు ఆంక్షలు, ప్రభుత్వ ఆదేశాలతో సమస్య తీరదని, ప్రజల ప్రవర్తనలో స్వచ్ఛంద మార్పు రావాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. దీపావళి వంటి పండుగలను పర్యావరణానికి హాని కలగకుండా సాంప్రదాయబద్ధంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని సూచించింది. విచారణలో భాగంగా పండుగల అతి వాణిజ్యీకరణ కూడా కాలుష్యానికి ఒక కారణమని జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీ పేర్కొన్నారు. కాలుష్యానికి పేదలను బాధ్యులను చేయడం సరికాదని సీజేఐ స్పష్టం చేశారు. సంపన్నులు వాడే ప్రైవేట్ వాహనాల వల్ల పెరిగే రవాణా రంగ పొగే ప్రధాన కారణమని అమికస్ క్యూరీ తెలిపారు. అలాగే పంట వ్యర్థాల (పరాలీ) దహనం నివారణకు కొనుగోలు ధర ముందే ప్రకటించి, నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించాలని ఆదేశించింది. బీఎస్–6 లేని వాహనాలపై ఆంక్షలు, డీజిల్ ఆటోల తొలగింపు వంటి చర్యలను కేంద్రం వివరించినప్పటికీ, ఏక్యూఐ 400 దాటడంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కాలుష్య నివారణకు ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల పర్యావరణ బాధ్యత కూడా అత్యంత కీలకమని ధర్మాసనం ఆదేశించింది.

మరో అవకాశం!

ఓటు గల్లంతైన వారికి ఈసీ మరో చాన్స్!

ముసాయిదా జాబితాలో పేరు లేకున్నా చేర్చుకునే అవకాశం

తెలుగు రాష్ట్రాలు సహా ఏడు రాష్ట్రాల ఎన్నికల అధికారులకు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్): ఓటర్ల జాబితాలో తమ పేరు కనిపించక ఆందోళన చెందుతు న్న వారికి కేంద్ర ఎన్నికల సంఘం తీపి కబురు అందిస్తూ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినా అర్హులైన పౌరులు తుది జాబితాలో తమ పేరును నమోదయ్యేలా చూసుకునేందుకు మరొక అవకాశం కల్పించాలని భావించింది. ఈ మేరకు తెలం గాణ, ఆంధ్రప్రదేశ్ వంటి తెలుగు రాష్ట్రాలతో సహా మొత్తం ఏడు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికా రులకు అత్యంత కీలకమైన అధికారిక ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవర ణ ప్రక్రియలో భాగంగా గైర్హాజరు, నివాస మార్పు, మరణం, నకిలీ నమోదులు వంటి కారణాలతో ఏఎస్‌డీఈ జాబితాలో చేరిన వారి వివరాలను మరోసారి నిశితంగా పరిశీలించాలని ఆదేశించింది. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని గట్టిగా స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణలో భాగంగా గైర్హాజరైనవారు, వేరే ప్రాంతాలకు నివాసం మార్చుకున్నవారు, మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైనవారిని గుర్తించి ప్రత్యేక జాబితాలను అధికారులు రూపొందిస్తున్నారు. అయితే ఈ సమగ్ర ప్రక్రియలో కొందరు అర్హులైన పౌరుల పేర్లు కూడా పొరపాటున జాబితాల నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రత్యేక జాబితాలను మరోసారి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గైర్హాజరు, నివాస మార్పు, నకిలీ నమోదుల కింద గుర్తించిన ఓటర్ల వివరాలను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ ఆఫీసులు, పురపాలక కార్యాలయాల్లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచాలని పేర్కొంది. తద్వారా తమ పేరు ఏ కారణంతో ప్రత్యేక జాబితాలో చేరిందో పౌరులు స్పష్టంగా తెలుసుకుని, పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునే వీలు కలగనుంది. అలాగే ఒకే రాష్ట్ర పరిధిలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి నివాసాన్ని మార్చుకున్న ఓటర్లకు దరఖాస్తు ప్రక్రియలో ప్రత్యేక వెసులుబాటు లభించింది. అలాంటి వారు సంక్లిష్టమైన ఫారం–8 సమర్పించాల్సిన అవసరం లేకుండానే ఎన్యూమరేషన్ ఫారం, చిరునామా ధ్రువీకరణ పత్రం సమర్పించి తమ వివరాలను ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చు. పాత ఓటరు గుర్తింపు కార్డు నంబరును ఉపయోగించి యాప్ లేదా ఈసీఐ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సులభంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు తుది జాబితాలో ఉండేలా పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఇంటింటి పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. వివరాలను పరిశీలించి దరఖాస్తులను సేకరించాలని సూచించారు. ఓటరు గుర్తింపు కార్డు ఉన్నంత మాత్రాన స్వయంచాలకంగా ఓటు వేసే అర్హత ఉండదని, తుది ఓటర్ల జాబితాలో పేరు ఉండటం తప్పనిసరని హెచ్చరించారు. ముసాయిదా జాబితాలో పేరు కనిపించకపోతే ఆందోళన చెందకుండా ఈసీఐ అధికారిక సేవల పోర్టల్ ద్వారా వివరాలు పరిశీలించుకుని, నిర్దేశిత గడువులోగా నమోదు దరఖాస్తులను పూర్తి

కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో భారీ అగ్నిప్రమాదం

చండీగఢ్, నవంబర్ 6 (సమయం న్యూస్): పంజాబ్‌లో ప్రయాణికులతో వెళ్తున్న కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపంలో రైలులోని ఓ బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి పక్కనున్న మరో మూడు బోగీలకు వ్యాపించాయి. దీంతో మొత్తం నాలుగు బోగీలు మంటల్లో చిక్కుకున్నాయి. ఈ ఘటనతో రైలులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే లోకో పైలట్ అప్రమత్తంగా వ్యవహరించి రైలును నిలిపివేయడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడినట్లు సమాచారం. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అందిన వివరాల ప్రకారం అమృత్‌సర్ నుంచి న్యూ జల్పాయ్‌గురి వైపు వెళ్తున్న 12508 నంబర్ కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రైలు సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపానికి చేరుకున్న సమయంలో ఇంజిన్ నుంచి ఐదో బోగీలో తొలుత మంటలు కనిపించాయి. కొద్దిసేపటికే మంటలు వేగంగా వ్యాపించి సమీపంలోని మరో మూడు బోగీలను చుట్టుముట్టాయి. బోగీల నుంచి పెద్దఎత్తున పొగలు ఎగిసిపడటంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రమాదాన్ని గుర్తించిన లోకో పైలట్ వెంటనే రైలును నిలిపివేసినట్లు సమాచారం. దీంతో ప్రయాణికులు బోగీల నుంచి బయటకు దిగారు. మంటలు మరింత విస్తరించకముందే ప్రయాణికులు సురక్షిత ప్రాంతానికి చేరుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదం కారణంగా నాలుగు బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాయి. బోగీల నుంచి పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటంతోపాటు దట్టమైన పొగలు వ్యాపించడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన ప్రాంతంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు రైల్వే సిబ్బంది చర్యలు చేపట్టారు. మరోవైపు అగ్నిప్రమాదానికి గల కారణాలపై రైల్వే అధికారులు విచారణ ప్రారంభించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరమే వెల్లడయ్యే అవకాశం ఉంది. బోగీల్లోని విద్యుత్ వ్యవస్థ, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించనున్నట్లు సమాచారం. ఈ ఘటనతో రైళ్లలో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకుంటున్న భద్రతా చర్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ప్రయాణికులతో వెళ్తున్న రైలులో ఒక బోగీ నుంచి మరో బోగీకి మంటలు వేగంగా వ్యాపించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదానికి కారణమైన పరిస్థితులను గుర్తించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదంలో దెబ్బతిన్న బోగీల వివరాలు, రైలు ప్రయాణం పునరుద్ధరణకు సంబంధించిన పూర్తి సమాచారం అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

- **మంటల్లో చిక్కుకుని నాలుగు బోగీలు దగ్ధం**
- **పంజాబ్‌లోని సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపంలో ఘటన**
- **అప్రమత్తమైన లోకో పైలట్.. సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు**
- **ప్రాణనష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు**



విధుల్లోనే కాదు.. క్రీడల్లోనూ సత్తా చాటిన పోలీసులు

- 1,535 మంది పోలీస్ క్రీడాకారులు.. మూడు రోజుల పాటు హోరాహోరీ పోటీలు
- ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్టీ జోన్-1 ఐజీ 'ఎస్.చంద్రశేఖర్ రెడ్డి'
- ఘనంగా ముగిసిన 5వ రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీలు... వరంగల్ సీపీ ఎన్.శ్వేత

వరంగల్, నవంబర్ 6 (సమయం న్యూస్)



పోలీసుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణతో పాటు జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహించిన 5వ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 ఘనంగా ముగిసింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ క్రీడా సంబరాల్లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ యూనిట్లకు చెందిన 1,535 మంది పురుష, మహిళా పోలీస్ క్రీడాకారులు పాల్గొన్నారు. హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియం, స్కిల్ స్టోర్మ్ స్కూల్, కిట్స్ కళాశాల క్రీడా ప్రాంగణం, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని రాణి రుద్రమదేవి హాలులో వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, సెపక్ తక్రా తదితర క్రీడల్లో పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా తమ ప్రతిభను ప్రదర్శించారు.ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్టీ జోన్1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ విధుల నిర్వహణలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు సిబ్బందిలో క్రీడాస్ఫూర్తి, ఐకమత్యం, సమష్టి తత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన పోలీస్ క్రీడాకారులకు వార్షిక ఇంక్రిమెంట్లు కూడా లభిస్తాయని పేర్కొన్నారు.అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు, జట్లకు బహుమతులు, ట్రోఫీలు అందజేసి అభినందించారు. మూడు రోజుల పాటు క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌తో పాటు ఇతర అధికారులను ప్రశంసించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీస్ క్రీడాకారులు క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని చాటారని తెలిపారు. క్రీడల్లో చూపిన ఉత్సాహం, అంకితభావంతోనే ప్రజాసేవలోనూ ముందుండాలని ఆకాంక్షించారు. క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమర్థంగా చేపట్టిన పోలీస్ కమిషనరేట్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) ఇతర అడిషనల్ డీసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

- ఇందిరమ్మ కుటుంబ బీమా'తో ఆర్థిక భరోసా
- నవంబర్ 19న సిద్దిపేటలో పథకం ప్రారంభం.. 20 నుంచి 30 వరకు ఇంటింటా దరఖాస్తుల సేకరణ
- TPCC వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దొంతుల రాజేష్ నేత

వరంగల్, నవంబర్ 6 (సమయం న్యూస్) :



తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కవరేజీ కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుందని TPCC వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దొంతుల రాజేష్ నేత తెలిపారు.మాజీ ప్రధానమంత్రి ఉక్కు మహిళ ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న సిద్దిపేటలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ఈ పథకాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించనుందని పేర్కొన్నారు.నవంబర్ 20 నుంచి 30 వరకు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం, మండలం, డివిజన్, వార్డు, గ్రామంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి కుటుంబాల నుంచి దరఖాస్తులు సేకరిస్తారని తెలిపారు. తహసీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులను స్వీకరిస్తారని వివరించారు.ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించి ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని దొంతుల రాజేష్ నేత పేర్కొన్నారు. కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మరో ముందడుగు వేస్తోందని స్పష్టం చేశారు.

పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు!

- రోడ్లపైనే వైన్స్ షాపులు.. ఏ వేళైనా లిక్కర్!
- పొంచి ఉన్న ప్రమాదాలు..
- గ్రామంలో పంచాయతీ కార్యాలయలు పాఠశాలల ముందు మద్యం విషయాలు.
- పట్టించుకోని అధికారులు!

రాయపోల్:నవంబర్ 06.(సమయం న్యూస్)

గ్రామీణ ప్రాంతాల్లో మద్యం విక్రయాలు, వైన్స్ షాపుల నిర్వహణ తీరుపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నిబంధనలను పాటించకుండా, రోడ్లకు ఆనుకుని మద్యం విక్రయాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సమయపాలన లేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రహదారులపైనే మద్యం విక్రయాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల సమీపంలో మద్యం దుకాణాలు ఉండటంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చే వాహనాలు రోడ్లపై నిలపడం, దుకాణాల పరిసరాల్లో జనసంచారం పెరగడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ప్రమాదాలు జరిగే ముప్పు ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. సమయపాలన ఏదీ?మద్యం దుకాణాలు నిర్ణీత సమయాల్లోనే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్ధరాత్రి వరకు విక్రయాలు కొనసాగుతున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా మద్యం అందుబాటులో ఉంటోందా? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరు?మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది. మరోవైపు, దుకాణాల వద్ద సరైన పార్కింగ్ సదుపాయాలు లేకపోవడం, రహదారులపై వాహనాలను నిలపడం వంటి సమస్యలు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించవచ్చు. ఇలాంటి పరిస్థితులు ప్రమాదాలకు దారితీయకముందే సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తం కావాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పందించాలిగ్రామీణ ప్రాంతాల్లో మద్యం దుకాణాల నిర్వహణపై సంబంధిత ఎక్సైజ్, పోలీసు, రహదారి భద్రతా అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. దుకాణాల పని వేళలు, అనుమతులు, రహదారులపై పార్కింగ్ సమస్యలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆలేరు ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- రైతులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవికుమార్ హెచ్చరిక

ఆలేరు, నవంబర్ 06(సమయం న్యూస్):



ఆలేరు పట్టణంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవికుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆలేరు పట్టణానికి విచ్చేసిన ఆయన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, అక్కడ ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి పది రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రోజుల తరబడి ఉండటంతో వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ధాన్యం తీసుకొచ్చి పది రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు తేమ శాతం పరీక్షించకపోవడం, జల్లీలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పాటు రైతులకు తాగునీరు కూడా అందుబాటులో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విసిగిపోయిన కొందరు రైతులు తమ ధాన్యాన్ని తిరిగి ఇళ్లకు తీసుకెళ్లే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, ధాన్యం కొనుగోళ్లను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం ఇదే నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే రైతులను సమీకరించి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు పూల హన్మంతు, పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకరి సృజన్ కుమార్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు బందెల సుభాష్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి తునికి దశరథ, జిల్లా సెక్రటరీ కామిటికారి కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వడ్డేమాన్ నరేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సముద్రాల శ్రీనివాస్, కళ్లెం రాజు, సీనియర్ నాయకుడు బడుగు జహంగీర్, జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు పేరపు ఆనంద్, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు బీజని కొమురయ్య, 187వ బూత్ అధ్యక్షుడు గుర్రం నర్సింహులు, ఎలగందుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- నవంబర్ 15న నల్లగొండలో లక్ష మంది రైతులతో భారీ బహిరంగ సభ ఆలేరులో సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఆలేరు, నవంబర్ 06(సమయం న్యూస్)



ఈ నెల 15 నుండి జరిగే అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం ఆలేరు మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ దుర్గమ్మ గుడి, బస్టాండ్ మీదుగా రైల్వే గేట్ వరకు సాగి, అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ముగిసింది.అక్కడ నిర్వహించిన సభలో సీపీఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల పురిటి గడ్డ అయిన నల్లగొండ పట్టణంలో నవంబర్ 15 నుంచి 18 వరకు ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 14 నుంచి 18 వరకు వ్యవసాయ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిచయం చేసేలా 'అగ్రి షో' పేరుతో ప్రత్యేక వ్యవసాయ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 15న లక్ష మంది రైతులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.1936లో జాతీయోద్యమ స్ఫూర్తితో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఏర్పడిన అఖిల భారత కిసాన్ సభ 90 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ కాలంలో తెలంగాణ మహత్తర రైతాంగ సాయుధ పోరాటం, బెంగాల్‌లో తేభాగా ఉద్యమం, కేరళలో పున్నప్రవాయలార్ పోరాటం, మహారాష్ట్రలో వర్లీ ఆదివాసీ ఉద్యమం సహా అనేక రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించిందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన రైతాంగ ఉద్యమంలో 750 మంది రైతులు ప్రాణత్యాగం చేసి చట్టాలను వెనక్కి తీసుకునేలా పోరాడారని గుర్తుచేశారు. రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టబద్ధత కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులకు రుణ విమోచన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. 50 ఏళ్లు నిండిన వ్యవసాయ కూలీలు, పేద, మధ్య తరగతి రైతులకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని, పత్తి, వంట నూనెల దిగుమతులపై సుంకాలను పునరుద్ధరించాలని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.29 రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాల ప్రతినిధులు, అనుభవజ్ఞులైన రైతు ఉద్యమ నాయకులు ఈ జాతీయ మహాసభల్లో పాల్గొని రైతాంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు దూపటి వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పీఏసీఎస్ డైరెక్టర్ మధ్యబోయిన పాల్గొన్నారు.

శుభకార్యాలు, పుణ్యక్షేత్రాల యాత్రలకు కుషాయిగూడ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- తక్కువ ధరకే అద్దె బస్సులు.. అయ్యప్ప భక్తులకు ప్రత్యేక రాయితీలు

కుషాయిగూడ: వివాహాలు, ఇతర శుభకార్యాల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కుషాయిగూడ డిపో నుంచి నూతన బస్సులను తక్కువ అద్దె ధరలకే అందుబాటులో ఉంచుతున్నట్లు డిపో మేనేజర్ వి. వేణుగోపాల్ తెలిపారు. అలాగే కార్తీకమాసం సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రాలతో పాటు ఇతర పుణ్యక్షేత్రాలకు ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేక యాత్ర బస్సులను నడుపుతున్నట్లు వెల్లడించారు.షిరిడి, గాణగాపూర్, పండరీపూర్, రామేశ్వరం, కాశీ, గోవా, పూరి తదితర పుణ్యక్షేత్రాలకు ప్రతి నెలా ప్రత్యేక బస్సు యాత్రలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కనీసం 30 మంది ప్రయాణికులు ఉంటే, వారు కోరుకున్న ప్రాంతం నుంచి వారు సూచించిన గమ్యస్థానానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అయ్యప్ప మాలధారుల శబరిమల యాత్ర కోసం కూడా సౌకర్యవంతమైన బస్సులను తక్కువ అద్దెకు అందిస్తున్నట్లు వివరించారు. ఈ బస్సుల్లో గురుస్వామికి ఉచిత సీటు కల్పించడంతో పాటు, ఇద్దరు వంటవారు, ఇద్దరు కన్నెస్వాములు, ఒక అటెండర్‌కు సీట్లు లేకుండానే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.అంతేకాకుండా కేరళ బోర్డర్ ట్యాక్స్ మినహాయింపు కూడా ఉంటుందని పేర్కొన్నారు.ప్రయాణికులు, భక్తులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు. మరిన్ని వివరాలు, బస్సుల బుకింగ్ కోసం 9603549388, 9493210071, 9959226145 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కీసర సమీపంలో టిప్పర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి దుర్మరణం

- ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం.. కాప్రాలో విషాదఛాయలు



కీసర: ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాప్రాకు చెందిన 18 ఏళ్ల ఇంటర్మీడియట్ విద్యార్థి మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై కీసర వైపు వెళ్తుండగా టిప్పర్ లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.కాప్రా ప్రాంతానికి చెందిన ధీరవత్ సూర్య ప్రకాష్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం బైక్‌పై కీసర వైపు వెళ్తుండగా ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో టిప్పర్ లారీ అతడి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూర్య ప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులుసమాచారం అందుకున్న కీసర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలు, టిప్పర్ లారీ ఢీకొన్న పరిస్థితులపై విచారణ చేపట్టారు. చిన్న వయసులోనే మృత్యువాతచదువుకుంటూ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న విద్యార్థి అకాల మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనతో కాప్రా ప్రాంతంలో విషాదం నెలకొంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయపోల్ నవంబర్ 06. (సమయం న్యూస్)

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా ఐకెపి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి గిట్టుబాటు ధర పొందాలని సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ రాజా గారి రేణుక రాజా గౌడ్ అన్నారు. శుక్రవారం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటలను దళారులకు విక్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించి గిట్టుబాటు ధర పొందాలని ఆకాంక్షించారు. దళారుల మాయమాటలు నమ్మి రైతులు మోసపోవద్దని. మోసపోతే గోసపడతామని పేర్కొన్నారు. ఐకెపి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఐకెపి అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పరివేక్షించి ధాన్యం తూకం వేసే విధంగా చర్య తీసుకోవాలని అన్నారు. ఐకెపి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు.ఇప్పటికే వర్షాలు లేక రైతులకు పంట నష్టం జరిగిందని. ఉన్న పంట కొనుగోలు కేంద్రం వద్ద తరలించిన రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని. ఎవరైనా ఇష్ట రాజ్యాంగ వివరిస్తే రైతుల పక్షాన తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యానికి ఐకెపి అధికారులు కొర్రిలు పెట్టకుండా కేంద్రాలకు వచ్చిన ధాన్యం వెంటనే తూకం వేసి రైతులకు న్యాయం చేయాలని ఆమె సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మరియాల స్వామి. ఐకెపి ఎపిఎం యాదగిరి. సిసి నాగరాజు. వార్డు సభ్యులు కరుణాకర్ .సునంద. నర్సింలు. నాయకులు తప్పెట సుధాకర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.



శ్రీనివాసపురంలో దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందుల పంపిణీ

ఆలేరు, నవంబర్ 06(సమయం న్యూస్):

ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం దూడలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వడ్ల శోభన్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశుపోషకులకు నట్టల నివారణ మందుల ప్రాముఖ్యతను వివరించారు. దూడల్లో నట్టల సమస్యను నివారించేందుకు సకాలంలో మందులు అందించడం ద్వారా వాటి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు మెరుగైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. పశుపోషకులు పశువైద్య శాఖ అందిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 65 దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం ఇస్తారు, వడ్ల స్వామి, చౌడబోయిన ఉపేందర్, నాగరాజు, ఆంజనేయులు, కనకయ్య, పోతారం దేవయ్య, రాజు, కొలనుపాక పశు గణాంక అధికారి లు పాల్గొన్నారు.



పర్యాటక శాఖ ప్రత్యేక ప్రచారం 6.0 విజయవంతం

న్యూఢిల్లీ, నవంబర్ 6(సమయం న్యూస్):

పెండింగ్ పనుల పరిష్కారం, పారిశుధ్యం, పరిపాలనా సామర్థ్య పెంపు లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక ప్రచారం 6.0ను పర్యాటక మంత్రిత్వ శాఖ విజయవంతంగా పూర్తి చేసింది. నిర్దేశించిన 5,654 లక్ష్యాలకు గాను 7,125 పనులు పూర్తి చేశారు. 63,461 చదరపు అడుగుల కార్యాలయ స్థలం ఖాళీ చేసి, స్క్రాప్ విక్రయం ద్వారా రూ.68.05 లక్షల ఆదాయం పొందారు. 3,006 భౌతిక ఫైళ్లు, 3,645 ఈఫైళ్లు తొలగించారు. దేశవ్యాప్తంగా 302 స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసిన బండారు దత్తాత్రేయ

న్యూఢిల్లీ, నవంబర్ 6(సమయం న్యూస్):

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం న్యూఢిల్లీలో పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



క్యాన్సర్ మందుల ధరలు 20–70 శాతం వరకు తగ్గింపు

న్యూఢిల్లీ, నవంబర్ 6(సమయం న్యూస్):

క్యాన్సర్ చికిత్సను మరింత అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 137 రకాల నాన్‌షెడ్యూల్డ్ క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను గరిష్ఠంగా 30 శాతానికి పరిమితం చేసింది. ఈ కొత్త ధరలు నవంబర్ 9, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి.

క్యాన్సర్ మందుల MRPలు సగటున 20 నుంచి 70 శాతం వరకు తగ్గాయి.ఇప్పటివరకు అత్యధికంగా 96.45 శాతం వరకు ధర తగ్గింపు నమోదైందిమందుల ధరల తగ్గింపుతో రోగులకు సుమారు రూ.3,357.49 కోట్ల ఆదా అవుతుందని అంచనా.నవంబర్ 4 నాటికి 70 కంపెనీలు 120 మందులకు సంబంధించి 1,136 SKUల కొత్త MRPలను సమర్పించాయి.ఆసుపత్రులు, మెడికల్ షాపులు కొత్త ధరలను స్పష్టంగా ప్రదర్శించాల్సి ఉంటుంది.మందుల ధరలను NPPA వెబ్‌సైట్, 'ఫార్మా సహీ దామ్' యాప్ ద్వారా ప్రజలు పరిశీలించవచ్చు.ఆయుష్మాన్ భారత్ PMJAY కింద కూడా క్యాన్సర్ చికిత్సకు నగదు రహిత వైద్య సేవలు అందుతున్నాయి. నవంబర్ 4 నాటికి మెడికల్ ఆంకాలజీకి సంబంధించి 19.5 లక్షల ఆసుపత్రి అడ్మిషన్లకు,సుమారు రూ.2,926 కోట్ల విలువైన చికిత్సకు అనుమతులు లభించాయి.క్యాన్సర్ స్క్రీనింగ్, చికిత్స, తక్కువ ధరకు మందుల సరఫరా వంటి చర్యల ద్వారా దేశవ్యాప్తంగా క్యాన్సర్ వైద్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని PIB తెలిపింది.

మైనారిటీ అభ్యర్థులకు 4 విదేశీ భాషల్లో ఉచిత ఫౌండేషన్ కోర్సులు

ఖమ్మం, నవంబర్ 6(సమయం న్యూస్)

తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ & కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 45 రోజుల పాటు జపనీస్, జర్మన్, ఫ్రెంచ్, కొరియన్ భాషల్లో ఉచిత ఫౌండేషన్ కోర్సులు నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్ తెలిపారు. SSC/ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన మైనారిటీ అభ్యర్థులు నవంబర్ 10లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9704003002 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

దీపావళి సందర్భంగా భద్రతా జాగ్రత్తలు

- **సురక్షితంగా, పర్యావరణహితంగా దీపావళి జరుపుకోవాలి: కలెక్టర్ దివాకర టిఎస్**

ఖమ్మం, నవంబర్ 6:(సమయం న్యూస్)



దీపావళిని ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. గ్రీన్ క్రాకర్స్‌కు ప్రాధాన్యతనిస్తూ శబ్ద, వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.బాణాసంచా కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించి, భవనాలు, విద్యుత్ తీగలకు దూరంగా ఖాళీ ప్రదేశాల్లోనే కాల్చాలని సూచించారు. నీరు, ఇసుక, ప్రథమ చికిత్స సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలను పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలని, వెలగని టపాసులను తిరిగి వెలిగించరాదని తెలిపారు.దీపాలను మండే వస్తువులకు దూరంగా ఉంచాలని, పెంపుడు జంతువులు, వీధి జంతువుల సమీపంలో పెద్ద శబ్దాల బాణాసంచా కాల్చవద్దని కలెక్టర్ కోరారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ ఆనందకరమైన దీపావళిని జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

మొయినాబాద్ లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

- **వం చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య**

చేవెళ్ల నవంబర్ 06, (సమయం న్యూస్)

మొయినాబాద్ మండలంలోని మేడిపల్లి గ్రామంలో మరియు మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు పెద్ద మంగళారంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



తెలంగాణ ఇన్వెస్ట్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు

- **డిసెంబర్ 7–9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో సమ్మిట్**

హైదరాబాద్ నవంబర్6(సమయం న్యూస్)

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి సచివాలయంలో మంత్రులు, అధికారులతో సమీక్షించారు. డిసెంబర్ 7-9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో సమ్మిట్ నిర్వహించనున్నారు.రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్, ఫార్మా-లైఫ్ సైన్సెస్, వ్యవసాయ, ఎడ్యుకేషన్, తెలంగాణ పెవిలియన్లతో పాటు క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఆరు ఎక్స్‌పో హాళ్లలో ఆధునిక సాంకేతికత, డ్రోన్లు, రోబోటిక్స్, స్టార్టప్ ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు.సమ్మిట్‌కు సుమారు 3,500 ఆహ్వానాలు పంపగా, 52 రంగాలవారీ సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రతినిధులకు ప్రత్యేక లైజనింగ్ అధికారులు, పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు.డిసెంబర్ 8న ఎల్‌బినగర్, వాతావరణ మార్పులపై ప్రత్యేక క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించి, కరువు, తాగునీటి భద్రత, వ్యవసాయం, జీవవైవిధ్య పరిరక్షణపై చర్చించనున్నారు.



తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- **250 గజాల ఇంటి స్థలం, రూ.25 వేల నెలవారీ పెన్షన్ కల్పించాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఉద్యమకారుల కమిటీ ప్రధాన సలహాదారు పసుపునూరి వీరేశం**

ఆలేరు, నవంబర్ 06(సమయం న్యూస్):



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆలేరు మండల ఉద్యమకారుల కమిటీ ప్రధాన సలహాదారు పసుపునూరి వీరేశం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించేందుకు కేకే కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులను ఆహ్వానించి వారి అభిప్రాయాలు, సమస్యలను సేకరించిందని తెలిపారు. కమిటీ నివేదిక, సిఫార్సులపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమన్నారు. కమిటీ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. గత పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన న్యాయం చేయలేదని విమర్శించారు. ఉద్యమకారుల త్యాగాలతో అధికారంలోకి వచ్చిన నాయకులు పదవులు అనుభవించినప్పటికీ, ఉద్యమకారుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు.అలాగే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలం, పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ఆ హామీలు అమలుకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. ఇటీవల జనగామ జిల్లాలో ఇద్దరు తెలంగాణ ఉద్యమకారులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఉద్యమకారులు ఇకపై ఆర్థిక ఇబ్బందులతో ప్రాణాలు తీసుకునే పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వారి కుటుంబాలకు భరోసా కల్పించి, తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రతి తెలంగాణ మలిదశ ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని పసుపునూరి వీరేశం డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యమకారుల కుటుంబాలకు ఉచిత వైద్యం, విద్యా సౌకర్యాలు కల్పించాలని, ఉద్యమకారుల పిల్లలకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన

- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**

కోస్గి మున్సిపల్, నవంబర్,06(సమయం న్యూస్)



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లా కోస్గి పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట మైన భద్రతా ఏర్పాట్లకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS, కోస్గి పట్టణంలో సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, రాకపోకల మార్గాలు, పార్కింగ్ స్థలాలు తదితర ప్రాంతాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను కేటాయించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకలు సాగించే మార్గాల్లో రోడ్డు ఓపెనింగ్ పార్టీలను ఏర్పాటు చేసి, రహదారులపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.అదే విధంగా రూఫ్‌టాప్ సెంట్రీలు, రోప్ పార్టీలు, కీలక కూడళ్లు మరియు ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రత్యేక భద్రతా బలగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ముగించుకుని తిరిగి వెళ్లే మార్గాన్ని ముష్రిఫా బోర్డర్ వరకు స్వయంగా పరిశీలించి, మార్గమధ్యంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.బందోబస్తు ముందస్తు ప్రణాళికతో సంబంధిత అధికారుల సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. ఎలాంటి భద్రతా లోపాలకు తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ముఖ్యమంత్రి పర్యటనను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఎస్పీతో పాటు డీఎస్పీలు నల్లపు లింగయ్య, ఏ. మహేష్, కోస్గి సీఐ సైదులు, ఆర్ఐ విజయ్ భాస్కర్, ఎస్సైలు చంద్రశేఖర్, భాగ్యలక్ష్మి రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుపై (HDPS)





రాయపోల్.నవంబర్ 06.(సమయం న్యూస్)

సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలంలో శుక్రవారం మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ కార్యక్రమంలో భాగంగా హెచ్‌డీపీఎస్ (High Density Planting System) అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం మరియు క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి గజ్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు బాబు నాయక్ గారు ముఖ్య అతిథిగా హాజరై హెచ్‌డీపీఎస్ పత్తి సాగు విధానాన్ని రైతులకు వివరించారు. ఈ పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా మొక్కల సాంద్రతను పెంచి, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.అనంతరం పత్తి పొలాలను సందర్శించి పంట ఎదుగుదల, మొక్కల సాంద్రత, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం మరియు సస్యరక్షణ చర్యలను పరిశీలించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ బాబు నాయక్, మండల వ్యవసాయ అధికారి శ్రీ ఆర్. నరేష్, ATMA డైరెక్టర్ జూనీ గౌడ్, AMC డైరెక్టర్ శ్రీ మల్లేశం, రైతులు కృష్ణ,బాలన్ రావు, తదితరులు మరియు అరేపల్లి గ్రామ ఉపసర్పంచ్ వీరేష్, వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష పాల్గొన్నారు

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లా పనితీరును మెరుగుపరచాలి

- **జనవరి మొదటి వారంలోగా సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం గరిష్ట స్థాయికి చేరాలి.**
- **మార్చి నెలాఖరు నాటికి వీబీ జీ రామ్ జీ ద్వారా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం సాధించాలి.**
- **వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.**
- **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయడంతో పాటు లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్ రాయితీలు అందించాలి.**
- **వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు.**

నారాయణపేట, నవంబర్,06(సమయం న్యూస్)



ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరును మరింత మెరుగుపరచాలని, విద్య, ఉపాధి హామీ, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు సూచించారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు.నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీ ఎస్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. జనవరి మొదటి వారంలోగా ఈ రెండు పథకాల నిధుల వ్యయాన్ని గరిష్టంగా 100 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి అదనపు నిధులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

పీఎం శ్రీ పథకం కింద రాష్ట్రానికి రూ.538 కోట్ల నిధులు కేటాయించగా, ఇప్పటివరకు నిధుల వినియోగం ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 794 పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ఫలితాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. పీఎం శ్రీ నిధుల వినియోగంపై ముఖ్యమంత్రి ప్రతి పది రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

202627 ఆర్థిక సంవత్సరానికి సమగ్ర శిక్ష అభియాన్ కింద రూ.1,763 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ.79 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతు పనులను సమగ్ర శిక్ష, వీబీ జీ రామ్ జీ పథకాల సమన్వయంతో చేపట్టాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ప్రతి జిల్లా తన పనితీరును మెరుగుపరచుకోవాలని, అన్ని పథకాల పురోగతి ముఖ్యమంత్రి డాష్‌బోర్డులో నమోదవుతుందని తెలిపారు. పాఠశాలలను అధికారులు తరచూ సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలను నాణ్యతతో అమలు చేయాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు యూనిఫారాలు, పాఠశాల కిట్లు అందేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.వేసవి కాలం ముగిసే వరకు ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని సీఎస్ సూచించారు. తాగునీటి వనరులను ముందుగానే గుర్తించి అవసరమైన మరమ్మతులు,ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు.ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి తాగునీటి కమిటీని ఏర్పాటు చేసి, జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ అధికారులు, పబ్లిక్ హెల్త్ అధికారులు తదితర శాఖల అధికారులను సభ్యులుగా నియమించాలని సూచించారు. ఈ కమిటీ ప్రతి వారం సమావేశమై తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించాలని, నవంబర్ నెలాఖరులోగా మండల స్థాయిలో కూడా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నవంబర్ 15వ తేదీలోగా చేతిపంపులు, బోర్ పంపులు, బహిరంగ బావులు తదితర తాగునీటి వనరులకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.మిషన్ భగీరథ పైపులైన్లలో ప్రెజర్ వాల్వ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని, నీటి వృథాను అరికట్టడంతో పాటు అక్రమ కనెక్షన్లు, అక్రమ ట్యాపింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే వీబీ జీ రామ్ పథకం కింద చేపట్టే పనులు నాణ్యతతో ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పించాలని సీఎస్ సూచించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 5.5 లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు.గత రెండేళ్లతో పోలిస్తే ఉపాధి కల్పనలో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొంటూ, మార్చి నెలాఖరు నాటికి వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్లకు సూచించారు. చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, కూలీలకు సకాలంలో ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని, సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సీఎస్ సంజయ్ జాజ్జు ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.దీపావళి సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు నూతన లోగోతో కూడిన స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, లబ్ధిదారుల ఇళ్లలో నిర్వహించే వేడుకలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా ఒక్కో ఇంటికి సుమారు పది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను లబ్ధిదారులకు ఉచితంగా అందించాలని, రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని సూచించారు. ఇందుకోసం 'మన ఇసుక - మన వాహనం' యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్ బస్తాను రూ.230కే అందించాలని, ఒక్కో బస్తాపై సుమారు రూ.100 మేర రాయితీ ప్రయోజనం లభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక, సిమెంట్ రాయితీల వల్ల లబ్ధిదారులకు కలిగే ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. చేయూత పింఛన్ వెరిఫికేషన్ తదితర అంశాలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, ఆర్.డి.ఓ.రమేశ్ డీఆర్డీవో వెంకట్ రాములు, జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, హౌసింగ్ పీడీ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు టీమిండియా!

జనవరి 2027లో భారత జట్టు పర్యటనకు సన్నాహాలు

- మూడు వన్డేలు, మూడు టీ20ల నిర్వహణకు ప్రతిపాదనలు
- రెండుసార్లు వాయిదా పడిన పర్యటనకు ఎట్టకేలకు కదలిక
- జింబాబ్వే సిరీస్ షెడ్యూల్ మారే అవకాశం
- ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ నేపథ్యంలో తేదీల సర్దుబాటు సవాల్
- కేంద్ర ప్రభుత్వ అనుమతుల తర్వాతే తుది నిర్ణయం



న్యూఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్): దాదాపు నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండుసార్లు వాయిదా పడిన టీమిండియా బంగ్లాదేశ్ పర్యటనను జనవరి 2027లో నిర్వహించేందుకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ పర్యటనలో భాగంగా భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లతో కూడిన ఆరు పరిమిత ఓవర్ల పోటీలను నిర్వహించాలని భావిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే భారత క్రికెట్ నియంత్రణ మండలి, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఇప్పటివరకు ఈ పర్యటనపై అధికారిక ప్రకటన చేయలేదు. ఇరు బోర్డుల మధ్య చర్చలు చివరి దశకు చేరుకున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. భారత జట్టు చివరిసారిగా 2022 డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లో పర్యటించింది. ఆ సందర్భంగా ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌లు జరిగాయి. ఆ తర్వాత పలు కారణాలతో ద్వైపాక్షిక సిరీస్‌ల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది. గతంలో నిర్ణయించిన పర్యటనలు రెండుసార్లు వాయిదా పడటంతో భారత జట్టు మళ్లీ బంగ్లాదేశ్ గడ్డపై ఎప్పుడు అడుగుపెడుతుందనే ప్రశ్న నెలకొంది. తాజాగా జనవరి 2027లో పర్యటన నిర్వహించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నట్లు వార్తలు రావడంతో నాలుగేళ్ల నిరీక్షణకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే ఈ పర్యటనను భారత జట్టు ఇప్పటికే ప్రతిపాదించిన అంతర్జాతీయ మ్యాచ్‌ల కార్యక్రమంలో సర్దుబాటు చేయడం ప్రధాన సవాలుగా మారింది. జనవరి 3 నుంచి 9 వరకు జింబాబ్వేతో మూడు వన్డేల సిరీస్ నిర్వహించాల్సి ఉన్నట్లు సమాచారం. అనంతరం జనవరి 21 నుంచి ఆస్ట్రేలియాతో ప్రతిష్ఠాత్మక బోర్డర్--గవాస్కర్ ట్రోఫీ ప్రారంభం కానున్నట్లు పేర్కొంటున్నారు. ఈ రెండు సిరీస్‌ల మధ్య బంగ్లాదేశ్‌తో ఆరు మ్యాచ్‌లను నిర్వహించేందుకు తగిన సమయం లభిస్తుందా అనే అంశంపై బోర్డులు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ పర్యటనకు అవకాశం కల్పించేందుకు జింబాబ్వేతో జరగాల్సిన మూడు వన్డేల సిరీస్ తేదీలను మార్చే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక నిర్ణయం వెలువడలేదు. ఆస్ట్రేలియాతో కీలకమైన టెస్టు సిరీస్‌కు ముందు భారత ఆటగాళ్లకు తగిన విశ్రాంతి, సాధన సమయం అవసరమవుతుందని భావిస్తున్నారు. దీంతో ఆటగాళ్ల పనిభారం, ప్రయాణాలు, మ్యాచ్‌ల మధ్య విరామం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది కార్యక్రమాన్ని రూపొందించాల్సి ఉంది. మరోవైపు భారత్, బంగ్లాదేశ్ మధ్య ఇటీవల నెలకొన్న పరిణామాలు కూడా క్రికెట్ సంబంధాలపై ప్రభావం చూపినట్లు కథనాలు వెలువడ్డాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో తలెత్తిన వివాదాలు, బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌కు సంబంధించిన పరిణామాలు ఇరు దేశాల క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ఈ వివాదాల ప్రభావంతో ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాల్లో ప్రతిష్టంభన ఏర్పడినట్లు ప్రచారం జరిగింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిణామాలు, క్రికెట్ బోర్డు నాయకత్వ మార్పుల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత బోర్డుతో సంప్రదింపులు ముందుకు సాగుతున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ పరిణామాలపై ఇరు బోర్డుల నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. బంగ్లాదేశ్ పర్యటనను ఖరారు చేయడానికి ముందు బీసీసీఐ కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు పొందాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇరు దేశాల మధ్య సంబంధాలు, భద్రతా పరిస్థితులు, ఆటగాళ్ల ప్రయాణ ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. బోర్డుల మధ్య చర్చలు సానుకూలంగా ముగిసి, ప్రభుత్వ అనుమతులు లభిస్తే జనవరి 2027లో భారత జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించే అవకాశం ఉంది. అదే జరిగితే 2022 డిసెంబర్ తర్వాత దాదాపు నాలుగేళ్ల విరామానికి తెరపడినట్లవుతుంది. అయితే అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ పర్యటనను ప్రతిపాదనగానే పరిగణించాల్సి ఉంటుంది.



ప్రధాని మోదీని కలిసిన సూర్యకుమార్ యాదవ్

సతీసమేతంగా ప్రధానితో ప్రత్యేక భేటీ

ప్రపంచకప్ స్వర్ణ పతకంతో సందడి చేసిన క్రికెటర్

న్యూఢిల్లీ, నవంబర్ 6 (సమయం న్యూస్): భారత టీ20 క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో తన భార్య దేవీశా శెట్టితో కలిసి ప్రధానిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ యాదవ్ దంపతులు ప్రధానితో కొంతసేపు ముచ్చటించారు. 2026 టీ20 ప్రపంచకప్ విజేతగా అందుకున్న స్వర్ణ పతకాన్ని సూర్యకుమార్ మెడలో ధరించి కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భేటీలో సూర్యకుమార్ దంపతులతోపాటు ఓ చిన్నారి కూడా పాల్గొంది. ఆ బాలిక కన్నడ భాషలో వినాయకుడి భక్తి కీర్తనలను ఆలపించి ప్రధాని మోదీని ఆకట్టుకుంది. చిన్నారి పాటను ప్రధాని ఆసక్తిగా విన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను ప్రధాని తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో ఆసక్తిని రేకెత్తించింది. మరోవైపు దీపావళి పండుగ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ప్రధాని మోదీ శ్రీరాముడి అయోధ్య రాకను ప్రస్తావించారు. పద్నాలుగేళ్ల వనవాసం అనంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని దీపావళి వేడుకలు నిర్వహించుకునే సంప్రదాయాన్ని గుర్తుచేశారు. దీపాల వెలుగులతో అయోధ్య నగరం, సరయూ నదీ తీరం దివ్యంగా ప్రకాశించాయని పేర్కొన్నారు. ఆ శుభప్రదమైన క్షణాలు దీపావళి వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకువచ్చాయని వివరించారు. ప్రధానితో సూర్యకుమార్ యాదవ్ దంపతుల భేటీ, చిన్నారి ఆలపించిన భక్తి గీతాలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.

సన్‌రైజర్స్‌తో సీఎస్కే భారీ ట్రేడ్ డీల్



లివింగ్‌స్టోన్‌తో పాటు మరో ఆల్‌రౌండర్ జట్టులోకి..?

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్): ఐపీఎల్ 2027 సీజన్ మినీ వేలానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీల మధ్య ఒక కీలకమైన నాలుగు ఆటగాళ్ల ట్రేడ్ డీల్ విజయవంతంగా ముగిసింది. సీఎస్కే జట్టు తమ వద్ద ఉన్న ఎడమచేతి వాటం పేసర్ ఖలీల్ అహ్మద్, ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ నాథన్ ఎల్లిస్‌లను సన్‌రైజర్స్‌కు బదిలీ చేయగా.. వారి స్థానంలో ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా యంగ్ సీమ్-బౌలింగ్ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్‌లను చెన్నై జట్టులోకి దక్కించుకుంది. గత వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ లియామ్ లివింగ్‌స్టోన్‌ను రూ. 13 కోట్లకు కొనుగోలు చేసినప్పటికీ, తాజా ట్రేడ్ ఒప్పందంలో భాగంగా అతడు రూ. 6 కోట్ల తగ్గించబడిన సవరించిన ధరకే సీఎస్కేలో చేరనున్నాడు. మరోవైపు ఆస్ట్రేలియా యువ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ తన ప్రస్తుత ఒప్పంద ధర అయిన రూ. 3 కోట్లకే చెన్నై ఫ్రాంచైజీలో చేరనున్నాడు. అదే సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఖలీల్ అహ్మద్‌ను అతని పాత కాంట్రాక్ట్ విలువ రూ. 4.8 కోట్లకు, నాథన్ ఎల్లిస్‌ను రూ. 2 కోట్లకు సొంతం చేసుకుంది. 2026 వేలంలో జాక్ ఎడ్వర్డ్స్ కోసం సీఎస్కే, సన్‌రైజర్స్ మధ్య తీవ్ర పోటీ నెలకొనగా చివరకు హైదరాబాద్ ఫ్రాంచైజీ అతడిని దక్కించుకుంది. అయితే పాదానికి తీవ్ర గాయం కావడంతో అతడు గత సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఆ వేలంలో కాంట్రాక్ట్ పొందిన అన్‌క్యాప్డ్ విదేశీ ఆటగాళ్లలో ఎడ్వర్డ్స్ ఒక్కడే కావడం గమనార్హం. ఇటీవల ఆస్ట్రేలియా తరఫున వన్డే, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఎడ్వర్డ్స్, దక్షిణాఫ్రికాతో జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన తన రెండో వన్డేలోనే ఐదు వికెట్లు పడగొట్టి తన సత్తా చాటాడు. ఇక ఖలీల్ అహ్మద్ విషయానికొస్తే అతనికి సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్తేమీ కాదు. 2018 నుంచి 2021 వరకు సన్‌రైజర్స్ తరఫున ఆడిన అతడు, 2026 ఐపీఎల్‌లో సీఎస్కే తరఫున 5 మ్యాచ్‌లు ఆడి తొడ కండరాల గాయంతో సీజన్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు మళ్లీ హైదరాబాద్ జట్టులోకి చేరి, ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి ట్రేడ్ ద్వారా వచ్చిన నటరాజన్‌తో కలిసి బౌలింగ్ విభాగంలో కీలక పాత్ర పోషించనున్నాడు. లియామ్ లివింగ్‌స్టోన్ రాకతో సీఎస్కే మిడిలార్డర్ బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ మరో బలమైన ప్రత్యామ్నాయం లభించనుంది. ఇప్పటివరకు 370 టీ20 మ్యాచ్‌ల్లో 8,595 పరుగులు సాధించడంతో పాటు ఆఫ్ స్పిన్, లెగ్ స్పిన్ బౌలింగ్‌తో 171 వికెట్లు తీశాడు. ఇటీవల యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో గ్లాస్గో కాస్మిక్ తరఫున పది ఇన్నింగ్స్‌ల్లో 219 పరుగులు చేశాడు. ఐపీఎల్ 2027 వేలానికి ముందు ఆటగాళ్ల రిటెన్షన్, విడుదల జాబితాలను సమర్పించేందుకు జట్లకు ఇచ్చిన గడువును బీసీసీఐ రెండు రోజులు పొడిగించింది. నవంబర్ 15గా ఉన్న తుది గడువును నవంబర్ 17 వరకు విస్తరించగా, ఐపీఎల్ 2027 మినీ వేలం డిసెంబర్ 16న గోవా వేదికగా నిర్వహించేందుకు నిర్ణయించారు.



విశాఖలో తొలి వన్డే..

బీసీసీఐ కీలక నిర్ణయం..

విశాఖపట్నం, నవంబర్ 6 (సమయం న్యూస్) : భారత్, శ్రీలంక జట్ల మధ్య జరగనున్న ప్రతిష్టాత్మక వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ వేదిక మారింది. తొలుత ఈ మ్యాచ్‌ను దేశ రాజధాని ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ.. తాజాగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వేదికను ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి మారుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో తొలి వన్డే మ్యాచ్ డిసెంబరు 13న విశాఖపట్నంలోని ఏసీఏ వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఢిల్లీలో తీవ్రంగా నెలకొన్న వాతావరణ పరిస్థితులు, మైదానంలో చేపట్టాల్సిన పునరుద్ధరణ పనుల నేపథ్యంలో ఈ మార్పు చేసినట్లు బీసీసీఐ అధికారికంగా వెల్లడించింది. చలికాలంలో రాజధాని ఢిల్లీలో సాధారణంగా వాయు కాలుష్యం అధికంగా ఉండటంతో పాటు అరుణ్ జైట్లీ స్టేడియంలో అవుట్‌ఫీల్డ్‌ను తిరిగి సిద్ధం చేసే పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో మ్యాచ్ వేదికను మార్చాలని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) బీసీసీఐని కోరింది. డీడీసీఏ చేసిన అభ్యర్థనను తీవ్రంగా పరిశీలించిన బీసీసీఐ.. ప్రతికూల వాతావరణం వల్ల మ్యాచ్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉండడం, స్టేడియంలో ప్రతిపాదిత పునరుద్ధరణ పనుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని వేదిక మార్పునకు ఓకే చెప్పింది. డిసెంబరు 13న జరగనున్న తొలి వన్డేను విశాఖపట్నంలోనే నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. శ్రీలంక జట్టు భారత పర్యటనలో భాగంగా మొత్తం మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. డిసెంబరు 13న విశాఖపట్నంలో తొలి వన్డేతో ఈ ద్వైపాక్షిక సిరీస్ ఘనంగా ప్రారంభం కానుంది. అనంతరం రెండో వన్డే డిసెంబరు 16న బెంగళూరులో, మూడో వన్డే డిసెంబరు 19న అహ్మదాబాద్‌లో జరగనున్నాయి. వన్డే సిరీస్ ముగిసిన వెంటనే పొట్టి ఫార్మాట్ టీ20 పోటీలు ప్రారంభమవుతాయి. డిసెంబరు 22న రాజ్‌కోట్‌లో తొలి టీ20, డిసెంబరు 24న కటక్‌లో రెండో టీ20, డిసెంబరు 27న పుణెలో మూడో టీ20 జరగనుంది.

భారత్, శ్రీలంక సిరీస్ పూర్తి షెడ్యూల్:

డిసెంబరు 13: తొలి వన్డే – విశాఖపట్నం
డిసెంబరు 16: రెండో వన్డే – బెంగళూరు
డిసెంబరు 19: మూడో వన్డే – అహ్మదాబాద్
డిసెంబరు 22: తొలి టీ20 – రాజ్‌కోట్
డిసెంబరు 24: రెండో టీ20 – కటక్
డిసెంబరు 27: మూడో టీ20 – పుణె

ఐపీఎల్‌లో మరో సంచలనం..

రూ.40 కోట్లు కావాలంటున్న టాప్ ప్లేయర్లు!

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్) : ఇండియన్ ప్రిమియర్ లీగ్ (ఐపీఎల్) వేలం చరిత్రలోనే సరికొత్త సంచలనాత్మక పరిణామం చోటుచేసుకోబోతోందా అంటే అవుననే సమాధానమే ధ్వనిస్తోంది. రాబోయే మెగా వేలానికి ముందే కొందరు భారత స్టార్ ఆటగాళ్లు తమ ఫ్రాంచైజీల ముందు ఊహించని భారీ రిటెన్షన్ ఫీజు డిమాండ్లను ప్రతిపాదించినట్లు విశ్లేషణలు వస్తున్నాయి. తమను జట్టులోనే కొనసాగించాలంటే ఏకంగా రూ. 40 కోట్ల భారీ మొత్తం చెల్లించాల్సిందేనని కొందరు టాప్ ప్లేయర్లు తమ యాజమాన్యాలకు స్పష్టం చేసినట్లు ప్రముఖ క్రికెట్ వెబ్‌సైట్ క్రిక్‌బజ్ నివేదిక ద్వారా వెల్లడైంది. ప్రస్తుతం జరగనున్న ఐపీఎల్ 2027 మినీ వేలం ప్రస్తుత మూడేళ్ల వేలం సైకిల్‌లో చివరిది కానుండగా, 2028 సీజన్ కోసం రాబోయే మెగా వేలంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. సాధారణంగా మినీ వేలంలో ఫ్రాంచైజీలు కేవలం పరిమిత స్థానాలను మాత్రమే భర్తీ చేసుకోగలవు. కానీ మెగా వేలంలో మాత్రం ప్రతీ జట్టు కొత్తగా రూపకల్పన చెందాల్సి ఉంటుంది. క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. కనీసం ఇద్దరు మార్క్యూ టాప్ ప్లేయర్లు తాము జట్టులో ఉండాలంటే రూ. 40 కోట్ల ఆఫర్ ఉండాలని మెలిక పెట్టగా, మరికొందరు ఫ్రాంచైజీలను నాయకత్వ బాధ్యతలు (కెప్టెన్సీ) కూడా డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ చరిత్రలో వేలం వేదికపై ఇప్పటివరకు పలికిన అత్యధిక ధర రూ. 27 కోట్లు కాగా, 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ రిషభ్ పంత్‌ను ఈ భారీ మొత్తానికి దక్కించుకుంది. ఆ సమయానికి ఒక జట్టు యొక్క పర్స్ పరిమితి రూ. 120 కోట్లుగా ఉండగా, రాబోయే మెగా వేలం నాటికి ప్రతీ ఫ్రాంచైజీ పర్స్ పరిమితిని రూ. 150 కోట్లకు పెంచే దిశగా బీసీసీఐ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. పర్స్ రూ. 150 కోట్లకు చేరితే, ఒకే ఆటగాడికి రూ. 40 కోట్లు ఇవ్వాల్సి రావడం జట్టు మొత్తం బడ్జెట్‌లో 25 శాతానికి పైగా ఆక్రమిస్తుంది. ఇది ఫ్రాంచైజీలకు జట్టు కూర్పు విషయంలో పెద్ద సవాలుగా పరిణమించనుంది. మరోవైపు ఐపీఎల్ 2027 మినీ వేలానికి సంబంధించి ఆటగాళ్ల రిటెన్షన్, విడుదల జాబితాలను సమర్పించే గడువును బీసీసీఐ నవంబరు 17 వరకు పొడిగించింది. ఈ మినీ వేలం డిసెంబరు 16న గోవా వేదికగా జరగనుంది. ఇప్పటికే రిషభ్ పంత్ లక్నో నుంచి ఢిల్లీ క్యాపిటల్స్‌కు మళ్లీ ట్రేడ్ కాగా, కుల్దీప్ యాదవ్ లక్నోకు, టి. నటరాజన్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మారడం వంటి కీలక పరిణామాలు ట్రేడింగ్ విండోలో చోటుచేసుకున్నాయి. ఏదేమైనా ఐపీఎల్ మెగా వేలం ముంగిట స్టార్ ఆటగాళ్లు చేస్తోన్న రూ. 40 కోట్ల డిమాండ్ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.





నా వనవాసం ఎప్పుడు ముగుస్తుంది?

మాజీ భార్య ట్యాగ్‌పై నటి రేణు దేశాయ్ ఆవేదన!

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్) : ప్రముఖ నటి, నిర్మాత రేణు దేశాయ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అధికారికంగా విడాకులు తీసుకుని సుమారు 14 సంవత్సరాలు పూర్తయినప్పటికీ, సమాజం ఇప్పటికీ తనను కేవలం పవన్ కల్యాణ్ మాజీ భార్యగానే చూస్తోందని, తనకంటూ ఒక స్వతంత్రమైన గుర్తింపును ఇవ్వడం లేదని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె తన వ్యక్తిగత జీవితంలోని కష్టాలు, నిరంతరం ఎదుర్కొంటున్న సోషల్ మీడియా ట్రోలింగ్‌పై మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా రేణు దేశాయ్ మాట్లాడుతూ.. "తెలుగు ప్రజలందరికీ నేను ఒకటే విన్నవించాలనుకుంటున్నాను. చాలామంది నా జీవితం కేవలం 'బద్రి' సినిమాతోనే ప్రారంభమైందని భావిస్తుంటారు. అంతకుముందు నాకు ఎలాంటి సొంత జీవితమే లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. మాకు అధికారికంగా విడాకులు వచ్చి ఇప్పటికే 14 ఏళ్లు పూర్తయ్యాయి. రామాయణంలో శ్రీరాముడు కూడా 14 ఏళ్లు మాత్రమే వనవాసం చేశాడు. మరి నా జీవితంలో సాగుతున్న ఈ మానసిక క్షోభ, ఈ మానసిక వనవాసం ఎప్పుడు ముగుస్తుంది?" అంటూ తీవ్ర భావోద్వేగంతో ప్రశ్నించారు. తన సొంత ప్రతిభ, సాధించిన విజయాల గురించి ప్రస్తావిస్తూ.. 2012లో విడాకులు తీసుకున్న తర్వాత తాను ఇంట్లో ఖాళీగా కూర్చోలేదని స్పష్టం చేశారు. సొంతంగా ఒక మరాఠీ సినిమాను నిర్మించానని, అది బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిందని గుర్తు చేశారు. ఆ తర్వాత మరో చిత్రానికి కథ అందించడంతో పాటు దర్శకత్వం, నిర్మాణ బాధ్యతలు కూడా స్వయంగా నిర్వహించానని తెలిపారు. అంతేకాకుండా పలు టీవీ డ్యాన్స్ షోలకు న్యాయనిర్ణేతగా పనిచేశానని, కవితలు రాశానని, ఇప్పుడు మళ్లీ వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నానని వివరించారు. నాకంటూ ఎలాంటి స్వతంత్ర గుర్తింపు, టాలెంట్ లేకపోతే నాకు ఇన్ని విభిన్న రంగాల్లో అవకాశాలు ఎందుకు వస్తాయని ఆమె ప్రశ్నించారు. సమాజంలో కొందరు వ్యక్తులు ఆయన లేకపోతే అసలు ఆమెకు బతికే అర్హతే లేదన్నట్లుగా దిగజారి మాట్లాడుతుంటారని, ఇతరుల వ్యక్తిగత జీవితాలను విమర్శించే ముందు కాస్త ఆలోచించాలని రేణు దేశాయ్ స్పష్టం చేశారు.



శార్వరి ఆశలన్నీ ఆ సినిమాపైనే!

'ముంజ్యా' తర్వాత మరో భారీ విజయం కోసం ఎదురుచూపులు

హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్) : బాలీవుడ్ యువ హీరోయిన్ శార్వరి వాగ్ ప్రస్తుతం తన కెరీర్‌లో తీవ్రమైన ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. 'బంటీ ఔర్ బబ్లీ 2' సినిమాతో కథానాయికగా వెండితెరకు పరిచయమైన ఈ భామ.. 'ముంజ్యా' చిత్రంతో అనూహ్య విజయాన్ని సాధించి విపరీతమైన గుర్తింపు తెచ్చుకుంది. ఆ సినిమాతో వచ్చిన క్రేజ్‌తో వరుసగా బాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థల నుంచి భారీ అవకాశాలు అందుకున్నప్పటికీ, ఆ విజయాన్ని ముందుకు కొనసాగించడంలో మాత్రం తడబడుతోంది. ముంజ్యా తర్వాత శార్వరి ఖాతాలో మరో భారీ హిట్ పడకపోవడం ఆమె కెరీర్‌ను రక్షణాత్మక ధోరణిలోకి నెట్టింది. శార్వరి నటించిన 'వేద' సినిమా బాక్సాఫీస్ వద్ద ఘోరంగా నిరాశపరిచింది. ఈ ఏడాది విడుదలైన 'మై వాపస్ ఆవూంగా' కూడా ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయిలో ఆదరణను అందుకోలేకపోయింది. ఇక ప్రతిష్టాత్మక యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ నిర్మించిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ఆల్ఫా' కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఈ సినిమాలో ప్రధాన పాత్రలో అలియా భట్ నటించగా.. శార్వరి తన నటన, సాహసోపేతమైన యాక్షన్ సన్నివేశాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అలియాకు పోటీ ఇచ్చేలా తన పాత్రలో రాణించినప్పటికీ.. సినిమా ఓవరాల్ ఫలితం ఆమెకు ఆశించిన తిరుగులేని గుర్తింపును తీసుకురాలేకపోయింది. వరుస పరాజయాలతో వెనకపడిపోయిన శార్వరి.. ఇప్పుడు రాబోయే 'యే ప్రేమ్ మోల్ లియా' సినిమాపైనే తన ఆశలన్నీ పెట్టుకుంది. బాలీవుడ్‌లో ఫీల్‌గుడ్ ప్రేమకథా చిత్రాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సూరజ్ బర్జాత్యా ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆయుష్మాన్ ఖురానాకు జోడీగా శార్వరి నటిస్తోంది. ప్రముఖ రాజశ్రీ ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. దాదాపు 11 ఏళ్ల తర్వాత దర్శకుడు సూరజ్ బర్జాత్యా, ప్రముఖ సంగీత దర్శకుడు హిమేష్ రేషమియా కలిసి పనిచేస్తుండటం ఈ చిత్రంపై బాలీవుడ్ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. నవంబర్ 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో పాటు వచ్చే ఏడాది విడుదల కానున్న 'బేపర్వా' కూడా శార్వరి కెరీర్‌కు అత్యంత కీలకంగా మారనుంది. 'యే ప్రేమ్ మోల్ లియా' చిత్రంతో శార్వరి మళ్లీ హిట్ల బాట పడుతుందా లేదా అనేది వేచి చూడాలి.

బాలయ్య 'దాదా'లో క్రేజీ ఐటెం సాంగ్..

థమన్ ఈసారి కూడా మాస్ బీట్‌తో దుమ్ములేపనున్నాడా?



హైదరాబాద్, నవంబర్ 6 (సమయం న్యూస్): నందమూరి నటసింహం బాలకృష్ణ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'దాదా' ఒకటి. గతంలో బాలయ్యతో 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందించిన మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. భారీ అంచనాల మధ్య శరవేగంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు చిత్ర బృందం ఎంతో కష్టపడుతోంది. మరోవైపు ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్న సంగీత సంచలనం ఎస్.ఎస్. థమన్ వర్క్ పట్ల అభిమానుల్లో విపరీతమైన అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాలో ఒక ఊపేసే ఐటెం సాంగ్ ఉండబోతోందనే ప్రచారం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. టాలీవుడ్‌లో బాలకృష్ణ, థమన్ కాంబినేషన్‌కు ప్రత్యేకమైన తిరుగులేని క్రేజ్ ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన గత చిత్రాల పాటలు, నేపథ్య సంగీతం (దీ+వీ) అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బాలయ్య మాస్ ఇమేజ్‌కు సరిగ్గా సరిపోయేలా థమన్ అందించే పవర్‌ఫుల్ బాణీలు థియేటర్లలో ప్రేక్షకులతో విజిల్స్ వేయిస్తుంటాయి. గతంలో వీరి కాంబినేషన్ తెచ్చిన మాస్ ఆల్బమ్స్ సూపర్ హిట్ కావడంతో 'దాదా' సినిమా సంగీతంపై కూడా అంచనాలు ఆకాశాన్ని తాకాయి. బాలకృష్ణ సినిమాల్లో ప్రత్యేక ఐటెం సాంగ్స్‌కు ఎప్పుడూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. మాస్ ప్రేక్షకులను థియేటర్లలో కుర్చీల్లో కూర్చోనీయకుండా ఊపేసేలా థమన్ అందించే బీట్స్ ఈ పాటలకు మరింత ఎనర్జీ ఇస్తుంటాయి. ఇప్పుడు 'దాదా' చిత్రంలో కూడా ఒక అదిరిపోయే ప్రత్యేక పాట ఉండబోతున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తుండగా, దీనికోసం థమన్ పక్కా మాస్ బీట్స్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ ప్రత్యేక పాటలో బాలయ్య సరసన స్టెప్పులు వేసే క్రేజీ బ్యూటీ ఎవరనే అంశం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. గతంలో బాలయ్య సినిమాల్లో కనిపించిన ఐటెం బాంబుల తరహాలోనే ఈసారి కూడా ఒక ప్రముఖ క్రేజీ కథానాయికను రంగంలోకి దించనున్నారా అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈ పాటలో డ్యాన్స్ చేయబోయే భామ ఎవరు, దీని చిత్రీకరణ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయాలపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రాన్ని బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, ఎమోషన్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్నారు. ఎలాంటి రూమర్లకు తావులేకుండా ఈ సినిమాను డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఆ నిర్ణయానికి గర్వపడుతున్నా



'స్త్రీ 2' బ్లాక్ బస్టర్ హిట్ అయిన తర్వాత చాలా పెద్ద సినిమా అవకాశాలు వచ్చినా.. నరైన కథ దొరికే వరకు ఎదురుచూడాలనుకున్నా" అని అంటున్నారు బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్. ఇటీవలే ఇన్‌స్టా వేదికగా అభిమానులతో ముచ్చటించిన శ్రద్ధకు.. కెరీర్‌లో ముందుకు వెళ్లాలనుకునే య-ువతకు మీరిచ్చే సలహా ఏంటి? అనే ప్రశ్న ఎదురైంది. దీనికి సమాధానంగా.. "నా అనుభవాన్నే చెబుతాను. 'స్త్రీ 2' తర్వాత నాకు చాలా సినిమా అవకాశాలు వచ్చాయి. భారీ పారితోషికం కూడా ఆఫర్ చేశారు. కానీ మనసుకు నచ్చిన కథ దొరికే వరకు ఓపికగా ఎదురుచూడాలని నిర్ణయించుకున్నా. ఆ నిర్ణయం తీసుకున్నందుకు ఇప్పుడు గర్వపడుతున్నా. మీ మనసు చెప్పేది వినండి. కొన్నిసార్లు అది కష్టంగా అనిపించినా.. చివరికి తగిన ఫలితం ఉంటుంద"ని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం శ్రద్ధా కపూర్ నటించిన 'ఈథా' డిసెంబరు 4న రానుంది.

PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత

- స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- డాక్టర్ అనితా రెడ్డి, అనీల్ చందర్

హనుమకొండ, నవంబర్ 6 (సమయం న్యూస్)



ప్రతి స్వచ్ఛంద సంస్థ ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, బాలల సంక్షేమం, సంరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అనీల్ చందర్, మాజీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి సూచించారు. హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో శుక్రవారం నిర్వహించిన మేనేజింగ్ కమిటీ సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు జువైనల్ జస్టిస్ చట్టం పరిధిలో ఉంటారని, వారి సంరక్షణ, రక్షణ కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన పిల్లలకు సక్రమంగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి సంస్థ తప్పనిసరిగా మేనేజింగ్ కమిటీని ఏర్పాటు చేసుకుని, పిల్లల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించి తగిన నిర్ణయాలు అమలు చేయాలని తెలిపారు. ప్రతి చిన్నారికి సంబంధించిన బయోడేటా, నేపథ్య వివరాలు, వైద్య చరిత్రతో కూడిన ప్రత్యేక ఫైల్ నిర్వహించాలని, సంస్థలు ఎప్పటికప్పుడు లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. బాలల హక్కులకు భంగం కలగకుండా, వారికి సురక్షితమైన వాతావరణం కల్పిస్తూ బంగారు భవిష్యత్తును అందించడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తే బాలల సంక్షేమ లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు.అనంతరం ఆశ్రమంలో మానసిక దివ్యాంగులైన పిల్లలకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలు, వసతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలను చక్కగా సంరక్షిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీయూ ప్రవీణ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, చైల్డ్‌లైన్ ప్రతినిధి, సుచరిత, వసుధ, హరిత తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావంతో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు

- ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి
- కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులతో దీపావళి వేడుకలు నిర్వహించాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 6:-



ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడి, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం, వీబీజీ రామ్ జీ, చేయూత పింఛన్లు, భూసేకరణ, సివిల్ వర్క్స్ పురోగతి తదితర అంశాలపై సమీక్షించారుఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు గ్రామీణ ప్రాంతాల్లో చేతిపంపుల మరమ్మతులు చేపట్టడంతో పాటు, పైప్‌లైన్ లీకేజీలను వెంటనే అరికట్టాలని ఆదేశించారు. నీటి సంరక్షణలో భాగంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, బోరుబావుల వద్ద సోక్‌పిట్లు, బోరుబావుల రీచార్జ్ నిర్మాణాలు చేపట్టి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని సూచించారువీబీజీ రామ్ జీ పథకం కింద ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు. జలసిరి పనులను విస్తృతంగా చేపట్టడం ద్వారా నీటి సంరక్షణకు మరింత దోహదపడాలని సూచించారుచేయూత పథకం కింద కొత్తగా అందిన పింఛన్ దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా, పారదర్శకంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులు ఈ దీపావళి పండుగను జరుపుకునేలా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.అలాగే, పీఎం శ్రీ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రభుత్వ అవసరాలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు టి.ఎల్.ఆర్‌డబ్ల్యూఎస్,శాఖల అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

కాప్రా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- మంత్రి శ్రీధర్‌బాబుకు కాప్రా ప్రెస్ క్లబ్ ప్రతినిధుల వినతి

కాప్రా, నవంబర్ 06:



కాప్రా ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కాప్రా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. ఈ మేరకు చర్లపల్లిలోని ప్రొఫెసర్ జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో విజ్ఞప్తి చేశారు.ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమవుతున్నప్పటికీ, చాలామంది జర్నలిస్టులకు సొంత ఇళ్లు లేక పరిమిత ఆదాయంతో అద్దె ఇళ్లలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.జర్నలిస్టుల సేవలను గుర్తించి, వారి సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కాప్రా ప్రాంతంలో పనిచేస్తున్న అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, వారి చిరకాల సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి వెంకట యోగి రామచంద్ర మూర్తి, ముఖ్య సలహాదారులు బేలిదే అశోక్ గుప్తా, సీనియర్ జర్నలిస్టు పలుగుల పవన్, ఉపాధ్యక్షులు యావాపురం రవి, వెంకట్, శనిగరం అశోక్, గాదె రాము, రమేష్, అమరేందర్, భవాని శంకర్, చుక్కా రమేష్, నిరంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలివ్వండి మహాప్రభో

- మంత్రి శ్రీధర్‌బాబుకు కాప్రా ప్రెస్ క్లబ్ వినతి

కాప్రా, నవంబర్ 6:



కాప్రా పరిధిలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కాప్రా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. చర్లపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి హాజరైన రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో విజ్ఞప్తి చేశారు.ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నిరంతరం కృషి చేస్తున్నామని ప్రతినిధులు పేర్కొన్నారు. అయినా చాలామంది జర్నలిస్టులకు సొంత ఇళ్లు లేక, పరిమిత ఆదాయంతో అద్దె ఇళ్లలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.జర్నలిస్టుల సేవలను గుర్తించి, వారి చిరకాల స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కాప్రా ప్రాంత జర్నలిస్టుల సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికేలా, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి వెంకట యోగి రామచంద్ర మూర్తి, ముఖ్య సలహాదారులు బేలిదే అశోక్ గుప్తా, సీనియర్ జర్నలిస్టు పలుగుల పవన్, ఉపాధ్యక్షులు యావాపురం రవి, వెంకట్, శనిగరం అశోక్, గాదె రాము, రమేష్, అమరేందర్, భవాని శంకర్, చుక్కా రమేష్, నిరంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం దందాకు అధికారుల అండ.!

- అక్రమ మద్యం విక్రయాలు.. ఎక్సైజ్ అధికారుల తీరుపై సీపీఐ(ఎంఎల్) ఆగ్రహం
- దుగ్గొండి మద్యం షాపుపై చర్యలేవీ..?
- ఆర్డీఓ కు వినతిపత్రం...కామ్రేడ్ మోడెం మల్లేశం
- దుగ్గొండి బ్రాందీ షాపును సీజ్ చేయాలి.. ఎక్సైజ్ అధికారులపై విచారణ జరపాలి

నర్సంపేట, నవంబర్ 6 (సమయం న్యూస్)



దుగ్గొండి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రాందీ షాపులో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, వాటికి సహకరించిన ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని సీపీఐ(ఎంఎల్) పార్టీ నాయకులు కామ్రేడ్ మోడెం మల్లేశం డిమాండ్ చేశారు. అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న బ్రాందీ షాపును సీజ్ చేయాలని కోరుతూ శుక్రవారం నర్సంపేట ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. దుగ్గొండి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రాందీ షాపును జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు తనిఖీ చేసిన సమయంలో అక్రమ మద్యం బయటపడినట్లు ఆరోపించారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని బ్రాందీ షాపుల నుంచి తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించినప్పటికీ, షాపు యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కై అక్రమ మద్యాన్ని బయటకు తరలించేందుకు సహకరించారన్నారు.అక్రమ మద్యం పట్టుబడినప్పటికీ షాపు యాజమాన్యంపై కేసులు నమోదు చేయకుండా, ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారులు వెళ్లిపోయారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిర్నిబావి, నర్సంపేట డివిజన్ పరిధిలోని ఇతర మండలాల్లోనూ అక్రమ మద్యం విక్రయాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మోడం మల్లేశం, కామ్రేడ్ భూమా అశోక్, కామ్రేడ్ అనిల్, భిక్షపతి పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం

- ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్ నైవేంబర్6(సమయం న్యూస్)

మైనార్టీల విద్య, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖపై సమీక్ష నిర్వహించారు.నాంపల్లి హజ్‌హౌస్ పక్కన అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసేందుకు రూ.25 కోట్లు కేటాయించాలని ఆదేశించారు. మొఘల్‌పురా, బండ్లగూడలో స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు.మైనార్టీ విద్యార్థుల విదేశీ విద్య కోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పరిధిలో ఈజిప్ట్, సౌదీ అరేబియాలను చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



హకీంపేటలో నవంబర్ 7–9 వరకు మెగా రైతు మేళా

హైదరాబాద్ నవంబర్6(సమయం న్యూస్,)

హైదరాబాద్: రైతుల ఆదాయం పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హకీంపేటలో మూడు రోజులపాటు జరిగే మేళాలో 150 స్టాళ్లు, 10 జిల్లాల నుంచి 50 వేల మంది రైతులు పాల్గొంటారని చెప్పారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, డ్రోన్లు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. లగచర్లలో ఎకో పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీకి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు.

బీసీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు స్టైపెండ్ పెంపు

హైదరాబాద్ నవంబర్6(సమయం న్యూస్)

బీసీ స్టడీ సర్కిళ్లలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల స్టైపెండ్‌ను పెంచినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.సివిల్ సర్వీసెస్ విద్యార్థులకు నెలవారీ స్టైపెండ్‌ను రూ.5 వేల నుంచి రూ.7 వేలకు, ఫౌండేషన్ కోర్సు విద్యార్థులకు రూ.1,000 నుంచి రూ.1,500కు పెంచారు. వార్షిక బుక్ ఫండ్‌ను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచినట్లు మంత్రి వెల్లడించారు.గత రెండేళ్లలో కోచింగ్ పొందిన పూర్వ విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్ష ద్వారా పునఃప్రవేశం, స్టైపెండ్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. స్టడీ రూమ్‌లు, డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

పుష్కర పనుల్లో జాప్యానికి తావొద్దు

హైదరాబాద్, నవంబరు 6(సమయం న్యూస్)

2027 గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని మౌలిక వసతులు కల్పించి, పనులను గడువులోగా పూర్తి చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ధర్మపురి సహా పుష్కర ప్రాంతాల్లో ఘాట్లు, రహదారులు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యం, విద్యుత్ తదితర ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులు చేపట్టి నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. పుష్కరాల కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1,000 కోట్లు కేటాయించగా, ధర్మపురిలో రూ.226 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు.



సిద్దిపేటలో 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

- సిద్దిపేటలో 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

సిద్దిపేట, నవంబర్ 6(సమయం న్యూస్)

ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2026-27లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో ఏర్పాటు చేసిన 418 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నాయని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. లక్ష్మి కిరణ్ తెలిపారు. కేంద్రాల్లో తాగునీరు, నీడ, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, పాడీ క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్లు, గన్నీ సంచులు తదితర సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి, శుభ్రపరిచి, ప్రభుత్వం నిర్దేశించిన FAQ నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం మేరకు తీసుకురావాలని సూచించారు.ధాన్యం తీసుకువచ్చిన క్రమంలో రైతుల సీనియారిటీ నమోదు చేసి, సీరియల్ నంబర్లు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు అనంతరం ధాన్యాన్ని రైస్ మిల్లులు, గోదాములకు తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని *కనీస మద్దతు ధర (MSP)*కు ధాన్యాన్ని విక్రయించుకోవాలని అదనపు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు NEHS సేవల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు

హైదరాబాద్, నవంబర్ 6(సమయం న్యూస్)

న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (NEHS) అమలులో ఉద్యోగులు, పెన్షనర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.సచివాలయంలో జరిగిన NEHS బోర్డు సమావేశంలో ఆసుపత్రుల్లో అడ్మిషన్లు, వైద్య చికిత్సలు, పెండింగ్ బిల్లుల చెల్లింపులపై సమీక్షించారు. యశోద, అపోలో, కిమ్స్ తదితర కార్పొరేట్ ఆసుపత్రుల ప్రతినిధులతో మాట్లాడిన సీఎస్.. NEHS రోగులకు అడ్మిషన్లు నిరాకరించరాదని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న పాత బిల్లులను త్వరగా పరిష్కరించాలని, చికిత్స బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వైద్య చికిత్సల ధరల్లో పారదర్శకత, ఏకరూపత ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఛార్జీలకు CGHS ధరలను ప్రాతిపదికగా తీసుకోవాలని ఆదేశించారు.



నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

పెద్దపల్లి, నవంబర్ (సమయం న్యూస్)

TASK సమన్వయంతో నిరుద్యోగ యువతకు Data Analyst, Retail Sales Associate, Pega Online కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. కోర్సు వ్యవధి 30 రోజులు నుంచి 3 నెలల వరకు ఉంటుంది. ప్రతి కోర్సులో 50 సీట్లు మాత్రమే. రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ నవంబర్ 18. వివరాలకు 90595 06807, 80966 59481 నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

ఇసుక రవాణాలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నిజామాబాద్, నవంబర్ 6:(సమయం న్యూస్)

జిల్లాలోని ఇసుక క్వారీల నుంచి ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, ఆన్‌లైన్ బుకింగ్ ద్వారానే ఇసుక కేటాయింపులు జరగాలని స్పష్టం చేశారు. అక్రమాలకు తావులేకుండా రెవెన్యూ, మైనింగ్, ఇంజినీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయ భవనాల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను నిర్దేశిత రీచ్‌ల నుంచి తరలించేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.



ఎల్‌నినో ప్రభావంతో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

మెదక్ నవంబర్6(సమయం న్యూస్)



ఎల్‌నినో ప్రభావంతో రబీ సీజన్‌లో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ, స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.సాగుకు ముందుగా అందుబాటులో ఉన్న నీటి వనరులు, బోర్లలో నీటి లభ్యతను అంచనా వేసుకోవాలని తెలిపారు. నీటి లభ్యతను అంచనా వేయకుండా వరి సాగు చేస్తే పంట ఎండిపోయి పెట్టుబడి నష్టాలు సంభవించే అవకాశం ఉందన్నారు.వ్యవసాయ, నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు పొలాల్లో ఫామ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు ఏర్పాటు చేసుకోవాలని, ముందస్తు ప్రణాళికతో పంటల ఎంపిక చేసుకుని నష్టాలను నివారించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేయాలి

- **కలెక్టర్ భవేష్ మిశ్రా**

నిర్మల్, నవంబర్ 6(సమయం న్యూస్)

రెడ్‌క్రాస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి, ఆపదలో ఉన్నవారికి తక్షణ సహాయం అందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని, యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని అన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా శాఖకు శాశ్వత భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని సభ్యులు కలెక్టర్‌ను కోరారు.



తక్కువ తూకంతో సరుకులు విక్రయిస్తే కఠిన చర్యలు

కొత్తగూడెం, నవంబర్ 6(సమయం న్యూస్):

వినియోగదారులకు తక్కువ తూకంతో సరుకులు విక్రయించే వ్యాపారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కూచన మనోహర్ హెచ్చరించారు. సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలతో బాబుక్యాంప్, పెద్దబజార్ ప్రాంతాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 26 కిలోలుగా పేర్కొన్న బియ్యం బస్తాల్లో 25 కిలోలు మాత్రమే ఉన్నట్లు గుర్తించి, నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై 6 కేసులు నమోదు చేశారు. ప్యాకేజీలపై నికర బరువును స్పష్టంగా ముద్రించి, అదే తూకంతో విక్రయించాలని వ్యాపారులకు సూచించారు.



జపనీస్, జర్మన్, ఫ్రెంచ్ మరియు కొరియన్ విదేశీ భాషల్లో ఉచిత ఫౌండేషన్

- **కోర్సులు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్**

ఖమ్మం, నవంబర్ 6 : (సమయం న్యూస్)



తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోని తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ & కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా మైనారిటీ అభ్యర్థులకు హైదరాబాద్ కేంద్రముగా (45) రోజుల పాటు జపనీస్, జర్మన్, ఫ్రెంచ్, కొరియన్ విదేశీ భాషల్లో ఉచిత ఫౌండేషన్ కోర్సులు నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్ సి/ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన మైనారిటీ అభ్యర్థులు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధులు, జైనులు, పార్సీ) నవంబర్ 10 తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అన్నారు. ఇతర వివరాలకు మొబైల్ నెంబర్ 9704003002 ను సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల మోడల్ కాలనీ త్వరలో ప్రారంభం

సూర్యాపేట, నవంబర్ 6(సమయం న్యూస్)

హుజూర్‌నగర్ రామస్వామిగుట్ట వద్ద 110 ఎకరాల్లో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.కాలనీలో విద్యుత్, స్ట్రీట్ లైట్లు, గ్రీనరీ, తాగునీరు, పైలాన్, సబ్‌స్థలి తదితర పనులను మంత్రి పరిశీలించారు. మిగిలిన పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించి, అత్యంత అర్హులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ కలెక్టర్ ఎస్పీ ఆర్డీవో హౌసింగ్ పీడీ జబ్బార్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, గుత్తేదారులు పాల్గొన్నారు.

రైతు మేళాను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు

దుద్యాల మండలం, నవంబర్,06(సమయం న్యూస్)



కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలం హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ లో శుక్రవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా నవంబర్ 7 నుండి 9 వరకు నిర్వహించే రైతు మేళా ఏర్పాట్లను అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల పాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారని ఇందులో భాగంగ మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించడంతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన భవనాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటరని ఆయన తెలిపారు. రైతు మేళాకు విచ్చేసే రైతులకు, మహిళా సంఘాల సభ్యులకు రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.రైతు మేళాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా త్రాగునీరు, భొజన వసతి కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.నవంబర్ 7నముఖ్యమంత్రి దుద్యాల మండలం హకీంపేట చేరుకుని అక్కడ నిర్వహిస్తున్న మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించి రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారని కలెక్టర్ తెలిపారు.రైతు మేళా సందర్భంగా 7500 పైగా రైతులు పాల్గొననున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిర్వహించే ముఖాముఖిలో పాల్గొని ఎల్ నినో ప్రభావంపై రైతుల అభిప్రాయాలను ముఖ్యమంత్రి తెలుసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు.నవంబర్ 8న ఉదయం ముఖ్యమంత్రి హకీంపేట చేరుకుని 7500 మంది స్వయం సహాయక సంఘాల మహిళలతో జరిగే సమావేశంలో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.9వ తేదీన ముఖ్యమంత్రి కొడంగల్ నివాసం నుంచి హకీంపేటకు చేరుకుని రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సభకు 10 జిల్లాల నుండి దాదాపు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.రైతు మేళా సందర్భంగా వ్యవసాయ అనుబంధ శాఖలైన వ్యవసాయ, పశు సంవర్ధక , మత్స్య శాఖ ల ద్వారా ఏర్పాటు చేసే స్టాళ్ల ద్వారా రైతులకు అధునిక వ్యవసాయ సాగు, రైతులకు అధిక దిగుబడి పంటలపై అవగాహనతో పాటు తగు సూచనలు, సలహాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ పర్యటనలో జడ్పీ సీఈఓ వివిధ శాఖల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించిన జిల్లా ఎస్పీ





కొడంగల్ నియోజకవర్గం,నవంబర్,06(సమయం న్యూస్)

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గ పర్యటన సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించి బందోబస్తు విధులపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి పర్యటన అత్యంత కీలకమైనదని, ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సమయపాలన, క్రమశిక్షణ పాటించాలన్నారు.వాహనాల తనిఖీలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, రూట్ బందోబస్తు, సభా ప్రాంగణ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.అనుమానాస్పద వ్యక్తులు, వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విధుల్లో ఉన్న సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పని సరిగా పాటించాలన్నారు.ముఖ్యమంత్రి పర్యటనను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించడం మసందరి బాధ్యత. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి అని జిల్లా ఎస్పీ సిబ్బందికి సూచించారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS, సంగారెడ్డి అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఇతర అధికారులు పాల్గొనడం జరిగింది.

డూప్లికేట్‌తాళంతో ఇంట్లో చోరీ

- **నేరేడ్‌మెట్ పోలీసుల ఛేదన ఒకరు అరెస్ట్.. 429 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం గుంటూరు, హైదరాబాద్‌లో రూ.25 లక్షలకు బంగారం విక్రయం.. మరో నిందితుడి కోసం గాలింపు**

మల్కాజిగిరి, సమయం




డూప్లికేట్‌తాళంతో తాళం వేసిన ఇంటిని తెరిచి భారీగా బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలను అపహరించిన కేసును నేరేడ్‌మెట్ పోలీసులు ఛేదించినట్లు మల్కాజిగిరి జోన్ డీసీపీ చి. శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు ఈ ఘటనలో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 429.92 గ్రాముల బంగారం, 2,974 గ్రాముల వెండి వస్తువులు, ముత్యాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. చోరీకి ఉపయోగించిన డూప్లికేట్‌తాళంతో పాటు మొబైల్ ఫోన్, కారును కూడా సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న మణె పద్మావతి అక్టోబర్ 20న తన పనిమనిషితో కలిసి కూరగాయల మార్కెట్‌కు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు డూప్లికేట్‌తాళంతో ఇంటి తలుపులు తెరిచి సుమారు 556 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.9 కిలోల వెండి వస్తువులు, ముత్యాల ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అక్టోబర్ 21న కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరిపిన్నట్లు తెలిపారు. సీసీటీవీ పుటేజీలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ ప్రత్యేక బృందాలతో గాలింపు చేప్పటగా. ఈ క్రమంలో నవంబర్ 5న తిరుమలగిరి సమీపంలో కారులో వేచి ఉన్న రెగుల చంద్రశేఖర్ (31)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తన సహచరుడు షాజీతో కలిసి ఈ చోరీకి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు. చోరీ చేసిన బంగారంలో సుమారు 13 తులాలను గుంటూరులో, మరో 25 తులాలను హైదరాబాద్‌లో విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. హైదరాబాద్‌లో విక్రయించిన బంగారానికి సుమారు రూ.25 లక్షలు పొందినట్లు పోలీసులు గుర్తించారు. మిగిలిన సుమారు 18 తులాల బంగారాన్ని తన వద్దే ఉంచుకున్నట్లు నిందితుడు తెలిపాడు. అతడి నుంచి 429.92 గ్రాముల బంగారం, 2,974 గ్రాముల వెండి వస్తువులు, ముత్యాల ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నేరానికి ఉపయోగించిన డూప్లికేట్‌తాళం, నిందితుడి గూగుల్ పిక్సెల్ మొబైల్ ఫోన్, ఏపీ16 సీడబ్ల్యూ 8883 రిజిస్ట్రేషన్ నంబర్ గల తెలుపు రంగు మారుతీ స్విఫ్ట్ కారును సీజ్ చేశారు. మిగిలిన చోరీ సొత్తు రికవరీతో పాటు, ఆభరణాలను కొనుగోలు చేసిన వ్యక్తుల వివరాల సేకరణపై పోలీసులు దృష్టి సారించారు పో లీ సు బృం దా ని కి అ భి నం ద న లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో, మల్కాజిగిరి జోన్ డీసీపీ చి. శ్రీధర్, పర్యవేక్షణలో మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ వి. యాదగిరి రెడ్డి, నేరేడ్‌మెట్ ఎస్‌హెచ్‌ఓ ఎ. వెంకటయ్య, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి. విజయభాస్కర్ రెడ్డి, పోలీసు సిబ్బంది సమన్వయంతో కేసును ఛేదించారు. నిందితుడిని పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేసిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందిస్తున్నట్లు తెలిపారు.

మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" వేడుకలు

- **జిల్లా వ్యాప్తంగా నవంబర్ 8న**
- **ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో పండుగ వెలుగులు నింపేలా ప్రత్యేక కార్యక్రమాలు**
- **ప్రతి ఇందిరమ్మ ఇంటి ముందు దీపాలు వెలిగించి వేడుకల్లో పాల్గొనాలి**

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 6:-



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా, కొత్తగా నిర్మించుకున్న ఇళ్లలో లబ్ధిదారులు దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా ఈనెల 8వ తేదీ ఆదివారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చలపతిరావు తెలిపారు.పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తూ, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 3,48,977 ఇళ్లలో ఇప్పటికే 2,06,982 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. "గుడిసెలు లేని తెలంగాణ" లక్ష్య సాధనలో భాగంగా ఈ పథకం ద్వారా వేలాది పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 14,445 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 6,617 ఇండ్లు పూర్తయ్యాయని,7,828 ఇండ్లు వివిధ దశలలో ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 8న ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.జిల్లాలో పూర్తయిన ప్రతి ఇందిరమ్మ ఇంటి ముందు గోడపై "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" లోగో స్టిక్కరింగ్‌తో పాటు లబ్ధిదారుల వివరాలను పెయింటింగ్ ద్వారా పొందుపరిచే ప్రక్రియను నవంబర్ 7వ తేదీలోగా పూర్తి చేయాలని,నవంబర్ 8న లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి నూతన ఇందిరమ్మ ఇంటి ముందు దీపాలు వెలిగించి, కుటుంబ సభ్యులతో ఫొటోలు తీసి ఇందిరమ్మ ఇండ్లు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.ప్రతి గ్రామం, వార్డు నుంచి కనీసం రెండు ఫొటోలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.ప్రతి గ్రామ పంచాయతీలో లబ్ధిదారుల ఇళ్లకు సంబంధించిన నిర్మాణానికి ముందు, నిర్మాణం పూర్తయిన తర్వాత ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని,ఈ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో @Indirammaindlu, @tghd.official, @telanganacmo ఖాతాలను ట్యాగ్ చేస్తూ #MaaIndirammaIntloDeepavali హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టు చేయాలని కోరారు.ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని,ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి నూతన గృహాల్లో దీపాలు వెలిగించి ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు.

కలెక్టర్ రాహుల్ శర్మకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 6 (సమయం న్యూస్)



జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్వో వసంతకుమారి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు, సిబ్బంది సమన్వయంతో మరింత అంకితభావంతో పనిచేసి జయశంకర్ భూపాలపల్లి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు.